Follow: @ANNTELUGU 09-07-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 186 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



మనవడి కోసం వంటగదిలోకి

## సీఎం రేవంత్

- స్వయంగా పూరీలు చేసిన తాత.
- మధుర క్షణాలను పంచుకున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర పరిపాలనా బాధ్యతలు, రాజకీయ కార్యక్రమాలతో నిత్యం తీరిక లేకుండా గడిపే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబంతో గడిపిన ఆప్యాయ క్షణాలను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. మనవడి కోరికను తీర్చేందుకు స్వయంగా వంటగదిలోకి వెళ్లి పూరీలు తయారు చేసిన వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయగా, అది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వీడియోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడితో కలిసి వంటగదిలోకి వెళ్లి ఎంతో ఆప్యాయంగా గడిపిన దృశ్యాలు కనిపించాయి. మనవడిని పక్కన కూర్చోబెట్టుకుని పిండిని కలిపి, చపాతీ పీటపై పూరీలు ఒత్తి, వేడినూనెలో స్వయంగా వేస్తూ

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



హరీశ్ రావు అంత నిష్ఠాతుడైతే కేసీఆర్ ఎందుకు తీసేశారు?

: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్

02



ఇదీ.. పవన్ కల్యాణ్ అంటే

జాతీయ స్థాయిలో ఏపీకి రెండో ర్యాంక్

03



ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు

02



## శరద్ పవార్, ఏక్‌నాథ్ షిండే భేటీ

- మహారాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ

03



ఆగస్టు 15వ తేదీలోగా

## ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- విద్యార్థులకు, ప్రైవేట్ కళాశాలలకు కొంత ఊరట

02



## కవిత ఆరోపణలపై.. సీబీఐ విచారణకు ఆదేశించాలి


03

- సీఎంను కోరిన ఎంపీ ధర్మపురి అర్వింద్
- కేటీఆర్, హరీష్ లపై తీవ్ర ఆరోపణలు చేసింది
- క్విడ్ ప్రోకో ఆరోపణలపై విచారణ జరగాలి

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు

02

- ఇస్లామాబాద్‌కు 48 గంటల అల్టిమేటమ్




హైదరాబాద్‌లో

# ఒలింపిక్స్.. నా డ్రీమ్

సీఎం రేవంత్ రెడ్డి

యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవం

పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్, మహా :**

ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందామని తెలిపారు. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారని గుర్తు చేశారు. పీటీ ఉషతో కలిసి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీని సీఎం ప్రారంభించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ వేడుకలో స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగోను పీటీ ఉషతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 8వ ఖేలో ఇండియన్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని, అందుకే

మిగతా 2వ పేజీలో



## కొండంత రచ్చ

- కడియం దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకో
- లేకుంటే రాజీనామా చూసి ఇంట్లో కూర్చో
- కొండా సురేఖ మాస్ వార్నింగ్
- వివాదాలపై పీసీసీ సీరియస్.. పరిశీలకుల నియామకం

02



## సింగరేణి భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం భరోసా

- తాడిచర్ల-II, నైనీ కోల్ బ్లాక్‌లతో రూ. 2.25 లక్షల కోట్ల టర్నోవర్
- వేలాది మంది కార్మికులకు ఉపాధి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

02



బీఆర్ఎస్ ఖాతాలో


## సొమ్మంతా అవినీతిదే

ఖాతాలోని రూ. 1400 కోట్లు అమర వీరుల కుటుంబాలకు పంచాలి

02

- ప్రాణం ఉన్నంత వరకు ఆ పార్టీలో చేరను
- కాళేశ్వరం అనకొండ హరీష్ రావు
- అధికారంలోకి రాగానే ఫినిక్స్ సంస్థతో పాటు భూకేటాయింపులపై సమీక్షిస్తాం
- సింగరేణి బాయిబాట కార్యక్రమం సందర్భంగా కవిత సంచలన వ్యాఖ్యలు





# హైదరాబాద్‌లో ఒలింపిక్స్.. నా డ్రీమ్

( మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 1990 2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది తమ డ్రీమ్ అని, 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని, దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు.

**క్రీడల్లో దేశం వెనుకబడింది**

ఒలింపిక్స్ పతకాల్లో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటుందన్న సీఎం కొంతమంది ఒలింపిక్స్, ఇతర గేమ్స్‌లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని విమర్శించారు. క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికే స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని, క్రీడలను ప్రోత్సహించడానికే స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు.

పీటీ ఉష మనందరికి స్ఫూర్తి అని, పీటీ ఉష ఆటల్లో, రాజకీయాల్లో, కెరియర్‌లో అందరికీ స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2018 ఓటమి తర్వాత రేవంత్ రెడ్డి పనైపోయిందని అన్నారని, కానీ లోకసభ ఎన్నికల్లో అతి పెద్ద నియోజకవర్గం నుంచి గెలిచానని, తర్వాత పార్టీ అధ్యక్షుడిని, సీఎం అయ్యానని గుర్తు చేశారు. నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని, చదువుకుంటే ఉద్యోగం వస్తుందో లేదో తెలియదని, ఆటలు ఆడితే మాత్రం కచ్చితంగా ఉద్యోగం వస్తుందని పేర్కొన్నారు.

**పెద్ద కల కనండి : పీటీ ఉష**

స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పీటీ ఉష తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పెద్ద కల కనండి, కష్టపడండి, సాధించండని పేర్కొన్నారు.

# సింగరేణి భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం భరోసా

( మొదటి పేజీ తరువాయి )

నరేంద్ర మోదీ చట్టపరమైన నిబంధనలను ఉపయోగించి తాడిచర్లII కోల్ బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక కాంగ్రెస్, కమ్యూనిస్ట్ సంఘాలు, అధికారులు, ఇంజనీర్స్ అసోసియేషన్లు, జీఎంల ఆర్గనైజేషన్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తులను తాను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతోనే ఈ సానుకూల నిర్ణయం జరిగిందన్నారు. ఒరిస్సాలో తెలంగాణ జెన్‌కోకు క్యాప్టివ్ మైన్‌గా కేటాయించిన 'నైనీ కోల్ బ్లాక్' అనుమతులను 2015 నుండి అప్పటి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం నిలిపివేసిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇటీవల ఒరిస్సాలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, తాను వ్యక్తిగతంగా అక్కడి ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని రకాల పర్యావరణ, ఇతర క్లియరెన్సులు ఇప్పించానని చెప్పారు. ప్రస్తుతం నైనీ బ్లాక్‌లో ఓవర్ బర్డన్ తొలగించి, విజయవంతంగా ట్రయల్ ప్రొడక్షన్ (బొగ్గు ఉత్పత్తి) ప్రారంభించడం సింగరేణి సాధించిన గొప్ప విజయమన్నారు. సింగరేణి పరిధిలో ప్రస్తుతం ఉన్న బ్లాక్‌లన్నింటిలో కెల్లా అత్యంత భారీ నిల్వలు ఉన్న గని తాడిచర్లII అని ఆయన వివరించారు. గతంలో సత్తుపల్లిలోని జీవీఆర్ ఓపెన్ కాస్ట్ 227 మిలియన్ టన్నులతో పెద్ద బ్లాక్‌గా ఉండేదని, కానీ ఇప్పుడు వచ్చిన తాడిచర్లII లో 434 మిలియన్ టన్నుల అత్యంత నాణ్యమైన గ్రేడ్8, గ్రేడ్9 రకానికి చెందిన బొగ్గు నిల్వలున్నాయని తెలిపారు. నైనీ బ్లాక్‌లో ఉన్న 455 మిలియన్ టన్నులతో కలిపి మొత్తం 795 మిలియన్ టన్నుల బొగ్గు తవ్వకానికి సింగరేణికి అవకాశం లభించిందని చెప్పారు. తాడిచర్ల గని ద్వారా ఏటా సగటున 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినా రాబోయే 45 సంవత్సరాల పాటు సింగరేణికి, తెలంగాణ ఇంధన భద్రతకు లాంగ్ టర్మ్ భరోసా లభిస్తుందని, రాబోయే 40 ఏళ్లలో ఈ రెండు బ్లాక్‌ల ద్వారా సింగరేణికి సుమారు రూ. 2,25,000 కోట్ల భారీ టర్నోవర్ సమకూరుతుందని వెల్లడించారు. ఇందులో తాడిచర్ల ద్వారా రూ. 1.50 లక్షల కోట్లు, నైనీ



బ్లాక్ ద్వారా రూ. 75 వేల కోట్ల టర్నోవర్ లభిస్తుందన్నారు. నైనీ బ్లాక్‌ను ఒరిస్సాలో కాంట్రాక్టర్ల ద్వారా డెవలప్ చేస్తున్నామని, అక్కడికి వెళ్లడానికి కార్మికులు ఇష్టపడరని.. కానీ తాడిచర్ల గనిలో 100 శాతం సింగరేణి కార్మికుల శ్రమనే వినియోగిస్తూ, 2 వేల మందికి పైగా కార్మికులకు 45 ఏళ్ల పాటు శాశ్వత ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ రెండు బ్లాకుల ద్వారా కొత్తగా 3,500 మందికి నూతన ఉద్యోగాలు లభిస్తాయని, రైల్వే నెట్‌వర్క్, నూతన రహదారులు వంటి మౌలిక వసతులు పెరుగుతాయని స్పష్టం చేశారు.

రాజకీయాలను పక్కన పెట్టి సింగరేణి ఆర్థిక సంక్షోభంపై దృష్టి పెట్టాలని కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కార్మికులు ప్రాణాలకు తెగించి రాత్రింబగళ్లు కష్టపడి తీసిన బొగ్గుకు సంబంధించిన రూ. 54,148 కోట్ల భారీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో సింగరేణి సొంత థర్మల్ పవర్ ప్లాంట్ నుండి తీసుకున్న విద్యుత్‌కుగాను తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ. 28,876 కోట్లు కాగా, తెలంగాణ జెన్‌కో సంస్థలు సింగరేణి నుండి తీసుకున్న బొగ్గుకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 25,272 కోట్లుగా ఉన్నాయని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా వాడుకుని రూ. 30,000 కోట్ల బకాయిలు పెట్టి ఫార్మ్‌హౌస్‌కు వెళ్లిపోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నరేళ్లలో మరో రూ. 24,000 కోట్ల బకాయిలను పెంచిందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఇంత భారీ మొత్తంలో బకాయిలు పెండింగ్‌లో ఉంటే సంస్థ ఎలా మనుగడ సాగిస్తుందని, కార్మికులకు ఏ రకంగా ధైర్యం ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో కిషన్ రెడ్డిని ప్రశ్నించే నైతిక హక్కు ఏ పార్టీకి లేదన్నారు.

తాను ఇక్కడికి రాజకీయాలు మాట్లాడటానికి రాలేదని, ఒక శుభకార్యం లాంటి బొగ్గు బ్లాక్ కేటాయింపు గురించి వివరాలు చెప్పడానికి వచ్చానని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఒక తెలంగాణ బిడ్డగా ఎంతో కష్టపడి, లీగల్ ఓపీనియన్లు తీసుకొని బొగ్గు బ్లాక్ తెస్తే అభినందించాల్సింది పోయి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి తనను విమర్శించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆ విమర్శలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణలో రెండు బొగ్గు బ్లాకులు వస్తే వాటిని సింగరేణి కార్మిక సంస్థకు ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టుకు కట్టబెట్టారని విమర్శించారు. గత యూపీఏ (కాంగ్రెస్) ప్రభుత్వ హయాంలో జరిగిన 'కోల్' కుంభకోణం వల్లే సుప్రీంకోర్టు దేశంలోని అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసి, పారదర్శక వేలం విధానాన్ని అమల్లోకి తెచ్చిందని, ఈ నిబంధనలు మోదీ ప్రభుత్వం తెచ్చినవి కావని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు ఎంతో సాహసంతో, అండగా నిలబడ్డారని, ఆ కార్మికుల రుణం తీర్చుకోవడానికే మోదీ ప్రభుత్వం ఈ బొగ్గు బ్లాకులను కేటాయించిందని తెలిపారు. సింగరేణి కేవలం ఒక కంపెనీ మాత్రమే కాదు, అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల్లో లేని ఈ గొప్ప సంపదను కాపాడుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు కలిసికట్టుగా ముందుకు రావాలని, సింగరేణి కష్టకాలంలో ఉన్నప్పుడు రాజకీయాలు పక్కన పెట్టి సంస్థ హితం కోసమే ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'

**.. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు**

**మహా :** ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

# మనవడి కోసం వంటగదిలోకి సీఎం రేవంత్

( మొదటి పేజీ తరువాయి )

సందడి చేశారు. పూరీలు గుండ్రంగా వస్తున్నాయా? ఇంకా ఎన్ని కావాలి? అంటూ మనవడితో సరదాగా మాట్లాడుతూనే వంట పూర్తి చేశారు. కుటుంబ సభ్యులతో గడిపిన ఈ క్షణాలు ముఖ్యమంత్రి వ్యక్తిగత జీవితంలోని మరో కోణాన్ని ప్రతిబింబించాయి. "తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా" అని మనవడు అడిగితే తప్పుతుందా? పక్కన మనవడు.. చేతిలో పిడికెడు పిండి.. దోసిట్లో నవ్వులు.. గుండ్రంగా లేని డజను పూరీలు.. బిజీ బిజీగా సాగుతున్న ప్రజా జీవితంలో మనవడితో కలిసి పూరీలు వేస్తూ గడిపిన ఈ కొన్ని క్షణాలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పోస్టు చేసిన ఈ వీడియోకు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ప్రజా జీవితంలోని ఒత్తిడికి మధ్య కుటుంబ సభ్యులతో గడిపిన ఈ ఆప్యాయ క్షణాలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. పలువురు ఈ వీడియోపై స్పందిస్తూ తాత-మనవడి అనుబంధాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ముఖ్యమంత్రి నిరాడంబరతను అభినందిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు.

# కడియం దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకో

**హైదరాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ తెలిపారు. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. కడియం శ్రీహరికి దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకోవాలని, లేకుంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని వార్నింగ్ ఇచ్చారు.

**వివాదాల పరిష్కారాలకు పరిశీలకుల నియామకం**

కొండా సురేఖ, కడియం శ్రీహరి వివాదం విషయంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ను, తుంగతుర్తి నియోజక పార్టీ వివాదం విషయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గార్ల ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీచేశారు. కాంగ్రెస్ పార్టీ లో నెలకొన్న వివాదాల విషయంలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కు, జగ్గారెడ్డి కి సూచించారు.

# హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే .. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

**: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్**

**హైదరాబాద్, మహా :** సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

# బీఆర్‌ఎస్ ఖాతాలో సొమ్మంతా అవినీతిదే

**కొత్తగూడెం, మహా :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని ప్రచారం చేస్తున్నారని.. అయితే తన కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేదే లేదని, ఆ పార్టీతో జత కట్టేది లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తాను ఎన్నో అవమానాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి బాయి బాటలో భాగంగా కొత్తగూడెం పర్యటనకు వెళ్లిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ. 1400 కోట్లు అవి క్విడ్ ప్రో క్రో కింద ఆంధ్రా కాంట్రాక్టర్లు ఇచ్చిన సొమ్ములు కాదా అని ప్రశ్నించిన కవిత.. ఆ సొమ్మును అమర వీరుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పంచాలని ఆమె డిమాండ్ చేశారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు వివిధ సంస్థలకు అప్పగించిన భూముల వివరాలను రివ్యూ చేస్తామని కవిత తెలిపారు. తాను ప్రజల్లో ఉండే పోరాడతానన్న కవిత.. తల్లి, చెల్లి అనే ఇంగితం మర్చిపోయి సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారన్న ఆమె.. మర్యాద పాటించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ సోషల్ మీడియాకు హెచ్చరికలు జారీ చేశారు. తమ పార్టీలోని యువత వ్యక్తిగత కామెంట్ల జోలికి పోరన్న కవిత.. లైన్ దాట్టొదని బీఆర్ఎస్ శ్రేణులను హెచ్చరించారు.

తమ పార్టీతో భయం లేదంటూనే ఎన్నికల సంఘానికి వెయ్యికిపైగా ఫిర్యాదులు ఇచ్చారని, టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండటం కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హరీశ్ రావును కాళేశ్వరం అనకొండ అంటూ సంచలన ఆరోపణలు చేసిన కవిత.. ఆయన్ను బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతోందన్నారు. కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో ద్వారా అక్రమ పర్మిషన్లు ఇచ్చారని కవిత ఆరోపించారు. ఫినిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారని ఆరోపించిన కవిత.. ఆ సంస్థ 33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందన్నారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పెట్టిన కేసులను కూడా పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమికి ఇంకా అదనంగా ఈ ప్రభుత్వం కూడా భూమి ఇస్తోందన్న కవిత.. అవినీతి విషయంలో బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ తలుపులు తెరిచిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పగించిన భూములు అన్నింటిపైనా రివ్యూ చేస్తామన్నారు.



తెలంగాణ ఉద్యమం సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంత ఖర్చు చేశాయన్న కవిత.. తెలంగాణ సాధించిన తర్వాత వారికి న్యాయం జరగాలని తాను బీఆర్ఎస్‌లో ఉండి కొట్లాడానన్నారు. అప్పుడు కూడా తాను ఉద్యమకారులు, కార్మికుల కోసం ఫైట్ చేశానని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలోనూ తాను ఉద్యమకారుల పక్షాన నిలబడ్డానని కవిత తెలిపారు కానీ ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు చేస్తున్న మోసాన్ని డైవర్ట్ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అంశాన్ని తెర మీదకు తెచ్చిందన్న కవిత.. సీఎం రేవంత్ రెడ్డికి సాగునీటి అంశాల పట్ల కనీస అవగాహన లేదన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా అర కిలోమీటర్ రాళ్ల గోడ కట్టి కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకోవచ్చని కవిత చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎత్తి పోసుకోవచ్చన్నారు. కానీ గత ప్రభుత్వంపై కక్షతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్ అనే హెల్త్ మిక్స్ ఉండాలని.. అప్పుడే సంస్థ బాగుంటుందని కవిత అభిప్రాయపడ్డారు. సింగరేణి ఇబ్బందుల్లో ఉండటానికి ఈ ప్రభుత్వమే కారణమని, సంస్థకు ఇవ్వాల్సిన రూ. 54 వేల కోట్లు ఇవ్వకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆరోపించారు. సింగరేణిలో వన్ విజన్, వన్ ఫ్యామిలీ అంటారు. కానీ ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తోందన్నారు. సింగరేణికి నిజాం 17 గనులను రాసిచ్చారన్న కవిత.. యూపీఏ హయాంలో జరిగిన భూ కుంభకోణం కారణంగా బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయం చేసిందని.. తద్వారా 17 బొగ్గు గనులను కేంద్రం లాక్కుందన్నారు. సింగరేణికి తాడిచర్ల గనిని ఇచ్చిన కేంద్రం మిగతా 16 గనులను కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు.

*** ఇస్లామాబాద్‌కు 48 గంటల అల్టిమేటమ్**

**ముజఫరాబాద్, మహా :** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రాజకీయ ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నాయి. పాక్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఆందోళనలను ఉధృతం చేస్తున్నాయి. తమ డిమాండ్లను 48 గంటల్లోగా ఆమోదించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) పాక్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మొత్తం 38 ప్రధాన డిమాండ్లతో ప్రభుత్వం ముందు అల్టిమేటమ్ ఉంచిన జేఏఏసీ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని తీవ్ర విమర్శలు చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని జేఏఏసీ ఆరోపించింది. ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసమే ఇస్లామాబాద్ నిర్ణయాలు తీసుకుంటోందని మండిపడింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై పూర్తి రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు అక్కడి ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష విధానాలను అమలు చేస్తోందని విమర్శించింది. ప్రస్తుతం వివాదానికి కేంద్రబిందువుగా మారింది పాక్ ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీలోని 12 నామినేటెడ్ స్థానాల అంశం. పాక్ నుంచి వలస వచ్చిన సుమారు 4.36 లక్షల మంది ఓటర్లకు ఈ 12 స్థానాలను కేటాయించడం అన్యాయమని జేఏఏసీ ఆరోపిస్తోంది. మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని సుమారు 33 లక్షల మంది ఓటర్లకు కేవలం 33 స్థానాలే ఉండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. ఈ విధానం ద్వారా పాక్ ప్రభుత్వం పీఓకే రాజకీయ వ్యవస్థను తన నియంత్రణలో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఇటీవల ఈ 12 నామినేటెడ్ స్థానాలకు రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉందంటూ పాక్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ తీర్పు ప్రజల్లో అసంతృప్తిని పెంచిందని, ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే నిర్ణయంగా జేఏసీ అభివర్ణించింది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ స్థానాలను వెంటనే రద్దు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేసింది. అలాగే గతంలో ప్రతిపాదించిన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చలను పునఃప్రారంభించాలని, నిత్యావసర వస్తువులపై సబ్సిడీలు పెంచాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశాలతో పాటు మొత్తం 38 డిమాండ్లను అధికారుల ముందుంచింది. ఇక జులై 27న పాక్ ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన వేళ జేఏఏసీ అల్టిమేటమ్ జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం స్పందించే తీరును బట్టి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జేఏఏసీ స్పష్టం చేయడంతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆగస్టు 15వ తేదీలోగా ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం

**హైదరాబాద్, మహా :** ఈ ఏడాదికి సంబంధించిన సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఆగస్టు 15 లోగా చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులకూ ఫీజు చెల్లిస్తామని పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టులో గురువారం జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఈ స్పష్టత వచ్చింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదంటూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఆ బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు ఉంటుందన్నారు. 2023 నుంచి ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. తర్వాత కొంత గడువుతో మిగతా బకాయిలు చెల్లించేలా చూడాలని హైకోర్టును కోరారు. గత విచారణలో జీవో9లో నాలుగు నిబంధనలపై షరతు విధించింది. అందులో కొన్ని నిబంధలపై విధించిన స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. స్టే వల్ల కొత్తగా చేరిన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయవద్దంటూనే గడువు కోరుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఫీజులు విద్యార్థుల అకౌంట్లలో జమయ్యాక వారు చెల్లించకపోతే బకాయిల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందో లేదో చెప్పాలని వారు ప్రశ్నించారు. రూ.2,800 కోట్ల బకాయి ఉండగా రూ.250 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారని పేర్కొన్నారు. గత బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారన్నదానిపై స్పష్టత ఇవ్వడంలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ అడ్మిషన్లు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. ఫీజు చెల్లించనట్లయితే అడ్మిషన్‌లను కాలేజీలు నిరాకరిస్తున్నాయని హైకోర్టుకు వివరించారు. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నష్టపోయే ప్రమాదం ఉందని వాదనలు వినిపించారు.

# కవిత ఆరోపణలపై.. సీబీఐ విచారణకు ఆదేశించాలి

**నిజామాబాద్, మహా :** తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణల పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ స్వయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుల పై చేసిన అవినీతి, క్విడ్ ప్రో కో ఆరోపణల పై స్పందించారు. కేటీఆర్, హరీశ్ రావుల పై వచ్చిన క్విడ్ ప్రో కో వంటి ఆరోపణలు సాధారణమైనవి కావని అన్నారు. కవిత చేసిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిధులు, క్విడ్ ప్రో కో లావాదేవీలు, ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌తో జరిగినట్లు ఆరోపించిన ఒప్పందాలు, ఫీనిక్స్ సంస్థకు రాజకీయ అండ, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్టర్లకు భూముల కేటాయింపుల పై కవిత చేసిన వ్యాఖ్యలు ప్రజాప్రయోజనాలకు సంబంధించినవని అర్వింద్ అన్నారు. ఈ అంశాల పై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసును సీబీఐకి అప్పగించడంలో జాప్యం, ఈకార్ రేసు వ్యవహారంలో ఆరోపణలు ఉన్నప్పటికీ విచారణ ముందుకు సాగకపోవడం, ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధ్యుల పై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం వంటి పరిణామాల వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి పై ప్రజల్లో ఇప్పటికే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అర్వింద్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించి, పూర్తిపారదర్శకతతో నిజానిజాలను వెలికితీసి, బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

# గ్రామపంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు**




**యాదాద్రి భువనగిరి జూలై 9 మహా :** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమము జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు అవగాహన కార్యక్రమానికి 10 మండలాలకు సంబంధించి ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట. బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూర్ (ఎం), మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరు మరియు మోత్కూరు మండలాలకు చెందిన సర్పంచులు మరియు పంచాయితి కార్యదర్శులు మరియు అధికారుల కోసం జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సరిత డిప్యూటీ కమిషనర్, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పి ఆర్ ఆర్డబ్ల్యూఎస్ డీఈలు ఏఈ లు సంబంధిత గ్రామాల సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరుల పెంపు 16వ ఆర్థిక సంఘం నిధుల సమర్థ వినియోగం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, వి బి జి రాంజీ చట్టం 2025, జల్ సిరి (నీటి సంరక్షణ కార్యక్రమం) మరియు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.

# రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

**తహసిల్దార్ దశరథ**

**వలిగొండ జులై 9 మహా న్యూస్**

మండలంలోని నరసాపురం దుప్పల్లి చిత్తాపురం కేర్చిపల్లివెలువర్తి నర్సాయగూడెం మజీర అరూర్ గ్రామాలకు రేషన్ షాపులు ఖాళీగా ఉన్నందున 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల లోపు వారు మాత్రమే ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని వలిగొండ మండల తహసిల్దార్ దశరథ ఒక ప్రకటనలో తెలిపారు మరింత సమాచారం కొరకు మండల తహసిల్దార్ కార్యాలయమును సంప్రదించగలరని తెలిపా

# ఊకల్ క్రాస్ వద్ద బురదను తొలగించిన పోలీసులు



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా ఉందని ప్రజలు వాహనదారులు వాపోతున్నారు. చినుకు పడితేనే రోడ్లన్నీ జలమయం గుంతలుగా తయారవుతున్నాయి. కనీస ధర్మంగా సంబంధిత అధికారులు రోడ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా వరంగల్‌నర్సంపేట ప్రధాన మార్గంలోని ఊకల్ క్రాస్ వద్ద లారీ పార్కింగ్ స్థలం నుంచి రోడ్డు పైకి చేరిన బురద చేరి ప్రమాదాలకు గురి అయి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రచార మాధ్యమాలలో రోడ్డు పరిస్థితి పై అనేక కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన గీసుగొండ పోలీసులు బురదను పూర్తిగా తొలగించారు. స్వయంగా సీఐ డి విశ్వేశ్వర్ తో కలిసి ఎస్ఐ అనిల్ రంగంలోకి దిగి వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి స్థానికుల సాయంతో ఆ బురద, వ్యర్థాలను శుభ్రం చేయించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. మళ్లీ ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తపడాలని యాజమాన్యాలను ఆదేశించి, రహదారులపై ఆటంకాలు కనిపిస్తే తక్షణం సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# ఆలేరు నియోజకవర్గ పిఏసిఎస్ నూతన పాలకమండలి నియామకం

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు...**

**యాదాద్రి భువనగిరి జూలై 9 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్ ) నూతన పాలక మండళ్లను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది రైతు సంక్షేమం, సహకార వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్లు బొమ్మలరామారం మండలం పిఏసిఎస్ చైర్మన్ గా సింగిర్తి మల్లేశం, తుర్కపల్లి మండలం పిఏసిఎస్ చైర్మన్ గా ధనావత్ శంకర్ నాయక్, యాదగిరిగుట్ట మండలం పిఏసిఎస్ చైర్మన్ గా చీర శ్రీశైలం, రాజపేట మండలం పిఏసిఎస్ చైర్మన్ గా నమిల మహేందర్, ఆలేరు పిఏసిఎస్ చైర్మన్ గా జనగాం ఉపేందర్ రెడ్డి, ఆత్మకూరు మండలం చైర్మన్ గా యాస లక్ష్మారెడ్డి, గుండాల మండలం చైర్మన్గా అండెం సంజీవరెడ్డిలుగా పాలక్ మండలి డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందన్నారు. ఈ నియామకాలకు ఆమోదం తెలిపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకార శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అలాగే నూతనంగా నియమితులైన చైర్మన్లు, డైరెక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు, ఇతర సహకార సేవలను పారదర్శకంగా అందించి సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న పిఏసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లందరికీ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు



# గవర్నర్ ను కలిసిన జిల్లా అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్

**మహా వరంగల్ బ్యూరో ;** ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల అలాగే వరంగల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నషముక్త్ భారత్ కార్యక్రమాలలో భాగంగా వరంగల్ మహా నగరానికి విచ్చేసిన తెలంగాణ గవర్నర్ శివప్రసాద్ శుక్ల, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ లను వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, తో కలిసి మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడి వెంట వరంగల్ యువజన విభాగ అధ్యక్షుడు కొరివి పరమేష్, మొహమ్మద్ కమాలుద్దీన్, వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

# భూముల రీ సర్వే పై వీడియో కాన్ఫరెన్స్

**యాదాద్రి భువనగిరి జూలై 9 మహా**

భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యం పై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ వీసీ లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి రూ. 100116 విరాళం

**గవర్నర్ మంత్రి సమక్షంలో చెక్కు అందజేసిన కుడా ఛైర్మన్ ఇనగాల**

**హనుమకొండ మహా ;** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి, అక్కడ చికిత్స పొందుతున్న తలసేమియా బాధితుల వైద్య సేవల నిమిత్తం హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 100116 ఆయన విరాళంగా అందజేశారు. గురువారం హనుమకొండ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా , రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పరిధిలోని బ్లడ్ బ్యాంక్, తలసేమియా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, బ్లడ్ బ్యాంక్‌లోని రక్త నిల్వలు మరియు సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇతర మానవతా సేవా కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గవర్నర్, మంత్రి సమక్షంలో విరాళానికి సంబంధించిన చెక్కును రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో రక్తం కొరతతో, తలసేమియా లాంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు, నిరుపేదలకు రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న మానవతా సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, వైద్య సేవలను విస్తరించేందుకు తమ వంతు బాధ్యతగా ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ విరాళం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ వాజ్పాయ్ , ఇతర ఉన్నతాధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలి

- **ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **టీజీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**





**హనుమకొండ మహా ;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటి ప్రయోజనాలు అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై రాష్ట్ర గవర్నర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం వందే మాతరం, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల చారిత్రక నేపథ్యం, అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య-ఆరోగ్య సేవలు, వ్యవసాయం, మౌలిక వసతులు, ఇతర కీలక అంశాలపై జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపడుతున్న భద్రత తదితర చర్యలను పోలీస్ కమిషనర్ శ్వేత వివరించారు.

సమీక్ష సందర్భంగా టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం అమలు, టీబీ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, స్క్రీనింగ్ క్యాంపులు, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరుపై గవర్నర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ, టీబీ నిర్మూలనకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని, విస్తృత స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం లక్ష్యంతో అమలయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో అన్ని అంశాలపై విస్తృతంగా చర్చించామని పేర్కొన్న గవర్నర్, పరిపాలనలో ఎదురయ్యే చిన్నచిన్న లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. జిల్లాల అభివృద్ధికి జిల్లా పరిపాలన, పోలీసు శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సమీక్షలో సమర్పించిన వివరాలను పరిశీలిస్తే ప్రతి రంగంలో మరింత నాణ్యత, సామర్థ్యం పెంచుకునే అవకాశం ఉందని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న గవర్నర్, ఈ ప్రాంతం పత్తి సాగుకు ప్రసిద్ధి చెందినందున రైతులను అధిక ఆదాయం వచ్చే పంటల సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని సూచించారు.

పాలనలో పారదర్శకత అత్యంత కీలకమని, పారదర్శక వ్యవస్థ వల్ల ప్రజలకు, రైతులకు, ప్రభుత్వానికి సమానంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధస్సు యుగంలోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, ఏఐ అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు. భవిష్యత్తులో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, దానిని భయపడాల్సిన అవసరం లేదని, ఏఐని మనిషి సృష్టించాడనే విషయాన్ని గుర్తుంచుకొని, దానిని సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకుని పరిపాలన, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో, ప్రతి రంగానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరును ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు.

వర్షాకాలంలో సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో అత్యవసర మౌలిక వసతులు, మరమ్మతులు, డ్రైనేజీ తదితర పనుల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి వరకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి హాస్టల్‌లో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వేడి నీటి సదుపాయం, డ్రైనేజీ నిర్వహణ, విద్యుత్ భద్రత, వంటశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, దెబ్బతిన్న భవనాలు, నీటి సరఫరా, డ్రైనేజీ తదితర పెండింగ్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

హాస్టళ్లలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, అత్యవసర వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

అత్యవసర నిధులను పారదర్శకంగా, అవసరాలకు అనుగుణంగా వినియోగించి, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి, "హాస్టళ్లలో చదువుతున్న ప్రతి విద్యార్థి భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రగతి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేసి, హనుమకొండ, వరంగల్ జిల్లాలను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో హనుమకొండ జిల్లాల ఆదనవు కలెక్టర్లు రవి సంధ్యారాణి, వరంగల్ డీసీపీ ధారా కవిత, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

**ఇదీ.. పవన్ కల్యాణ్ అంటే**

# జాతీయ స్థాయిలో ఏపీకి రెండో ర్యాంక్

**అమరావతి, మహా :** ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల అమలులో ఏపీ జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పరిశీలనలు చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులను పూర్తి చేసింది. దీంతో ఈ గుర్తింపు సాధ్యమైంది. రాష్ట్రంలో రోడ్ల నాణ్యతను మెరుగుపరచడానికి పంచాయతీరాజ్ శాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. కొన్ని ప్రాంతాల్లో పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. అధికారులకు తగిన సూచనాలు చేశారు. దీంతో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. దీంతో పవన్ పనితీరు దేశం గర్వించేలా, నేర్చుకునేలా ఉందంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# శరద్ పవార్, ఏక్‌నాథ్ షిండే భేటీ

**మహారాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ**

**ముంబై, మహా :** మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌సీపీ(ఎస్‌పీ) అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమావేశమయ్యారు. అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. మహారాష్ట్రకర్ణాటక సరిహద్దు వివాదంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అధ్యక్షతన అసెంబ్లీ భవనంలో నేడు (గురువారం) క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు. అదే సమయంలో శరద్ పవార్ తన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీలోని షిండే కార్యాలయానికి వెళ్లారు. పవార్ తన కార్యాలయంలో వేచి ఉన్నారని తెలియగానే షిండే క్యాబినెట్ సమావేశాన్ని మధ్యలోనే ముగించుకుని అక్కడికి వెళ్లారు. పుష్పగుచ్ఛంతో పవార్‌కు స్వాగతం పలికిన షిండే అనంతరం ఆయనతో సుమారు 15 నిమిషాల పాటు కీలక అంశాలపై చర్చించారు. డిప్యూటీ సీఎం వెళ్లిపోయిన తర్వాత కూడా పవార్ అదే కార్యాలయంలో తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. దీంతో ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

# ఫ్యూచర్.. బంగారమే



చూస్తుండగానే కాల చక్రం తిరిగి పోతుంది. మార్పులు, చేర్పులు శరవేగంగా జరిగిపోతూనే ఉంటాయి. ఆది మానవుడు మొదలుకుని నేటి ఆధునిక మానవుడు వరకు నిరంతరం కొత్తదనం కోసం అన్వేషణ సాగిస్తూనే వున్నాడు. అదే మానవ వికాసం వైపు సమాజాన్ని నడిపిస్తోంది. నిత్యం సరికొత్త శోధనతో మానవ మేధస్సు అసాధ్యాలను సుసాధ్యం చేసే దిశగా పరుగులు తీస్తోంది. శాస్త్ర, సాంకేతిక, సమాచార విస్ఫోటనంతో ప్రపంచం జగదేక కుటుంబమైంది. స్పీడుయుగంలో ప్రజలకు క్షణం తీరిక లేకుండా పోయింది. అవసరాలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాలు, పట్టణాలు విస్తరణ మొదలైంది. ఎడారి ప్రాంతాలు కూడా మహా నగరాలుగా మారిపోతూ జనావసరాలు తీరుస్తున్నాయి. ఇందుకు దుబాయ్ నిలువెత్తు సాక్షిగా నిలుస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాల సృష్టి అనివార్యమవుతోంది. ప్రపంచంలో ఇప్పుడు అన్నీ దేశాల్లో ఇది అత్యంత అవసరంగా మారిపోయింది. నగరాల విస్తరణకు పాలకులు పెద్ద పీట వేస్తున్నారు. మన దేశంలోనూ ఈ ట్రెండ్ వేగంగానే జరుగుతోంది. ఇది ఓ శుభ పరిణామం. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు ఇదే వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుండగా, తెలంగాణలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం ప్రక్రియ రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రాల అభివృద్ధికి ఇది ఓ కొలమానం. జనాభా పెరుగదల,అభివృద్ధికి అవినాభావ సంబంధం వుంది. ఆయా రాష్ట్రాల జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలకు తప్పనిసరి అవుతోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన కూడా ఇదే. అందుకే ఆయన ఫ్యూచర్ సిటీ నిర్మాణ సంకల్పం తీసుకున్నారు. అందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఏ నగరం, పట్టణం రాత్రికి రాత్రి నిర్మాణం కావు. అది అంచెలంచెల ప్రక్రియ. హైదరాబాద్ అభివృద్ధి వెనుక కూడా 450 సంవత్సరాల చరిత్ర వుంది. వేయి మైళ్ళ ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. నగరాలు, పట్టణాల ప్రగతి కూడా నిరంతరం సాగుతూ ఉంటుంది.

సంకల్పంలో చిత్తశుద్ధి ఉంటే చేపట్టిన పని లక్ష్యం చేరుతుందన్నారు స్వామి వివేకానంద. ఎన్ని అవరోధాలు, అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి ముందుకు సాగినప్పుడే ఫలితం దక్కుతుంది. తెలంగాణ సీఎం తలపెట్టిన ఫ్యూచర్ సిటీ ఆలోచన భవిష్యత్ తరాలకు ఓ దిక్సూచి అవుతుందంటున్నారు మేధావులు. హైదరాబాద్ లో హైటెక్ సిటీ, ఓల్డ్ సిటీ, సైబరాబాద్ లు వున్నాయి. నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీ నిర్మాణ ప్రక్రియ రేవంత్ ప్రారంభం చేశారు. సుమారు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం సాగబోతోంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ హైవే సమీపంలో శంషాబాద్ ఎయిర్ పోర్టును అనుసంధానం చేస్తూ ఫ్యూచర్ సిటీ రూపు దిద్దుకునేలా ప్లాన్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ఫ్యూచర్ సిటీకి ప్లస్ పాయింట్ కాగా రంగారెడ్డి జిల్లాలోని 56 గ్రామాలు, ఏడు మండలాలు ఫ్యూచర్ సిటీ పరిధిలోకి వచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక ఏర్పాటు చేసింది. ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ ఏరియా డెవలప్ మెంట్ ఆథారిటి (ఎఫ్ సీడీఏ) కు సీఎం బాధ్యతలు అప్పగించారు. ఓ అద్భుతమైన నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆశయం. దీని కోసం ఎలాంటి సవాళ్ళు ఎదురైనా ఎదురుకోవటానికి ఆయన సన్నద్ధంగా వున్నారు. ఎవరు అడ్డు పడినా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరిపి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ ఆలోచన, దానికి సంబందించిన ప్రణాళిక కేంద్రానికి కూడా రేవంత్ రెడ్డి వివరించారు. ప్రజా అవసరాలు తీర్చే అన్నీ కార్యాలయాలు, వసతులు, అత్యఆధునిక సాంకేతి విజ్ఞాన సంపత్తి ఫ్యూచర్ సిటీలో లభ్యం అయ్యేలా లోతుగా ప్లానింగ్ చేసిన సీఎం భవిష్యత్ లో దుబాయ్, న్యూయార్క్ వంటి సిటీల సరసన ఫ్యూచర్ సిటీ చేరుతుందని ధీమాగా చెబుతున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి చెందిన పనులు, ఇతరాలను సీఎం రేవంత్ ప్రతినిత్యం సమీక్షా సమావేశాలలో స్వయంగా పరిశీలన చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం సీఎంకు అత్యంత ప్రాధాన్యత అంశమే కాదు. ప్రతిష్టాత్మకంగా కూడా మారింది.

ఫ్యూచర్ సిటీ నిర్మాణం పైన విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. సీఎం రేవంత్ అత్యుత్సాహంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నారని, ఇది అవసరం లేని ఆలోచనగా వారు ఏద్దేవా చేస్తున్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఓ అడుగు ముందుకేసి ఫ్యూచర్ సిటీపైన తమ విధాన నిర్ణయం కూడా ప్రకటించింది. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ ప్రణాళిక రద్దు చేస్తామని ప్రకటించింది. హైదరాబాద్ ను అభివృద్ధి చేయటం పక్కన పెట్టి సీఎం రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేయటం ఏమిటని విమర్శలు గుప్పిస్తోంది. చిన్న వర్షం పడిన హైదరాబాద్ వాసులు నరకం చూడాల్సి వస్తుందని, దాన్ని పక్కన పెట్టి ఫ్యూచర్ సిటీ అంటూ ఆర్భాటాలకు పోతున్నారని విపక్షాలు మండిపడుతున్నాయి. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఈ విమర్శలు పట్టించుకోవటం మానేశారు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రశ్న లేదని ఆయన గట్టిగానే చెప్తున్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారం అందించే దిశగా సీఎం కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి, విజ్ఞాన సంపత్తి అందించే ఓ మహోజ్వల సిటీగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతుందని సీఎం వివరణ ఇస్తున్నారు.

అభివృద్ధి అనేది ఓ నిరంతర ప్రక్రియ. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రగతికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ప్రభుత్వాలు ఏ కార్యక్రమం చేపట్టినా విపక్షాలు విమర్శలు ఆరోపణలు చేయటం సర్వసాధారణ విషయం. ఇప్పుడు అదే జరుగుతోంది అంటున్నారు కాంగ్రెస్ నేతలు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవాలని విపక్షాలు ప్రయత్నం చేయటం రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవటమేనని వారు అంటున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని వారు హెచ్చరిస్తున్నారు. ఇక్కడే విపక్షాలు మరో ఆరోపణలు ఎత్తుకున్నాయి. సీఎం ఫ్యూచర్ సిటీ ఆలోచన వెనుక కుట్ర ఉందని విపక్షాలు అంటున్నాయి. వేల కోట్ల రూపాయల భూములు కొల్లగొట్టే పథకం ఈ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వెనుక ఉందని వారి ఆరోపణలు.

ఫ్యూచర్ సిటీ ఎందుకు? ప్రస్తుతం వున్న హైదరాబాద్ సిటీని మరింతగా అభివృద్ధి చేస్తే సరి పోతుంది కదా? వేల కోట్లు ఖర్చుతో మరో సిటీ నిర్మాణం ఇప్పుడు అవసరమా? ఇలాంటి ప్రశ్నలు విపక్షాలతో పాటు కొందరు ప్రశ్నించే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడే వాళ్ళు ఓ సారి గతాన్ని గుర్తు చేసుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు సీఎంగా వ్యవహరించిన చంద్రబాబునాయుడు హైదరాబాద్ లో రోడ్లు వెడల్పు చేసే సమయంలోనూ, ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టినప్పుడు, హైటెక్ సిటీ ఏర్పాటు ఆలోచన అమలులోకి తెచ్చినప్పుడు కూడా ఇలాంటి ప్రశ్నలు, వ్యతిరేకత వచ్చాయి. అయినా చంద్రబాబు తాను అనుకున్న రీతిలో హైదరాబాద్ అభివృద్ధి చేశారు. దాని ఫలితమే సైబరాబాద్ గా జనం ముందు నిలిచింది. భావి తరాల అవసరాలు గుర్తించి, దానికి అనుగుణంగా అభివృద్ధి చేసే వాళ్ళే దూరదృష్టి వున్న నాయకులు. ఈ కోవలో చంద్రబాబు ముందు ఉండగా రేవంత్ రెడ్డి ఆ ప్రయత్నంలో పరుగులు పెడుతున్నారు. అభివృద్ధికి సహకారం అందించక పోయినా వచ్చే నష్టం లేదు. కానీ అడ్డుకునే యత్నాలు ప్రమాదకరమంటున్నారు నిపుణులు. పాలకులకు ఓ విజన్ ఉంటుంది. అందులో కొన్ని వెంటనే ప్రజలకు మేలు చేస్తాయి. మరి కొన్ని భవిష్యత్ లో ఉపయోగంలోకి వస్తాయి. ఫ్యూచర్ సిటీ అలాంటిదే. అది ఇప్పటికిప్పుడే బహుళ ప్రయోజనం చూపించక పోవచ్చు. కానీ ముందు తరాలకు అది ఓ వనరుల సిటీ కావచ్చు. ఫ్యూచర్ సిటీ అనేది ముమ్మందు ప్రపంచంలోనే పెట్టుబడుల కేంద్రం కావచ్చు. సాఫ్ట్ వేర్ సంస్థలకు నిలయంగా పేరు తెచ్చుకోవచ్చు. సీఎం రేవంత్ రెడ్డి కృషి, ముందు చూపు అప్పుడు ప్రశంసలు అందుకోవచ్చు. అభివృద్ధిని ఎప్పుడు అప్పటికి అప్పుడు తినే ఫాస్ట్ ఫుడ్ గా చూడకూడదు. అది ఊరగాయలాంటిది. అంటున్నారు నిపుణులు.


ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్ కు చెందిన సీబీఆర్ఈ సంస్థ ఆధ్వర్యంలో సిటీ రూపు దిద్దుకోబోతోంది. ఈ మేరకు అధికారిక లాంఛనాలు పూర్తి అయ్యాయి. రోడ్లు, విద్యుత్, మురుగునీటి పారుదల, పరిశ్రమలు, హోటళ్లు, ఇతర భవనాలు ఏవి ఎక్కడ, ఎలా నిర్మాణం చేయాలో ఓ బ్లూ ప్రింట్ సిద్ధమైంది. సింగిల్ విండో విధానం ద్వారా ఇక్కడ పరిశ్రమలు, నిర్మాణాలు సాగించుకునే సౌకర్యం ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. హైదరాబాద్ ఓ మహా నగరం. ప్రపంచంలో గుర్తింపు పొందిన సిటీ. ఫ్యూచర్ సిటీతో ఇది మరింతగా వృద్ధికావాలి. భావితరాల ఫ్యూచర్ బంగారుమయం అవ్వాలి.



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**

# ఆధునిక విద్యుత్ యుగానికి మార్గదర్శి టెస్లా

ప్రకృతిలోనిశక్తినినియంత్రించగలిగితేమనిషిసాధించలేనిది ఏదీ లేదని భావించిన గొప్ప ఆవిష్కరణకర్త. ప్రకృతిలోని శక్తుల వెనుక ఉన్న విద్యుత్ సూత్రాలను అర్థం చేసుకోవాలని ప్రయత్నంచేసిన వ్యక్తి. ఆధునిక జీవనశైలిని తన సిద్ధాంతాలతో ప్రభావితం చేసిన, సాంకేతికతను యాంత్రీకరణను ఒక్కో ఇటుకలా పేరుస్తూ మనిషి జీవనం సులభతరం కావడానికి పునాది వేసిన మహానుభావుల్లో ప్రముఖ శాస్త్రవేత్త నికోల టెస్లా ఒకరు. వంద సంవత్సరాల క్రితమే ఎటువంటి భౌతిక వాహకాలు లేకుండా విద్యుత్ శక్తిని ప్రసరింప చేయాలనే ఆలోచనతో ప్రయోగాలు చేసి, దాదాపు ప్రపంచ వ్యాప్తంగా 5 ఖండాలు 27 దేశాలలో సుమారు 300కి పైగా పేటెంట్ హక్కులు కలిగి ఉన్న గొప్ప శాస్త్రవేత్త నికోల టెస్లా. టెస్లా యొక్క దూరదృష్టి మరియు ఆవిష్కరణల పట్ల ఆయనకున్న పట్టుదల ఆయన్ను చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఆవిష్కర్తలలో ఒకరిగా నిలిపాయి. నికోలాటెస్లా 1856 సంవత్సరం జులై 10 న ప్రస్తుత క్రొయేషియా దేశంలోని స్మిల్జన్ అనేగ్రామంలో మిలుటిన్టెస్లా మరియు జార్జినాద్యూకా టెస్లా దంపతులకు నాల్గవ సంతానంగా జన్మించారు.టెస్లా తండ్రి ఒక పూజారిగా పనిచేసేవారు. అంతేకాకుండా ఆయన మంచి రచయిత మరియు కవి. ఈయన చిన్నతనం నుండే నికోలాటెస్లాకు జ్ఞాపకశక్తిని,ఆలోచనాశక్తిని పెంచేలా ప్రత్యేకమైన మానసిక శిక్షణ ఇచ్చేవారు. అలాగే టెస్లా తల్లిగారు పెద్దగా చదువుకోకపోయిన అద్భుతమైన జ్ఞాపకశక్తి కలిగినది. ఇంటి పనులను సులువుగా చేసుకోవడానికి చిన్నచిన్న గృహోపకరణాలను ఆమె స్వయంగా తయారుచేసేవారు. నికోలా టెస్లా తనలోని ఆవిష్కరణల ప్రతిభ అంతా తన తల్లి నుంచే వచ్చిందని స్వయంగా తన ఆత్మకథలో రాసుకున్నారు. టెస్లాకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. చిన్నతనంలో ఉండే ఊహాశక్తి, బలమైన ఆలోచనలే మనిషి భవిష్యత్తును గమ్యాన్ని నిర్ణయిస్తాయని, బలవంతంగా చేసే ఏపనైనా మనిషి జీవనశక్తిని హరిస్తుందని, తానుమాత్రం ఎప్పుడూ తనసొంత ఆలోచనలతోనే ఎదిగానని టెస్లా తన ఆత్మకథలో పేర్కొన్నారు. టెస్లాకు చిన్నప్పటి నుండి ఒక వింత అలవాటు ఉండేది.ఆయన ఏదైనా వస్తువు లేదా ప్రదేశం గురించి ఆలోచించినప్పుడు, అది ఆయన కళ్ళముందు నిజంగా ఉన్నట్లే ఒక స్పష్టమైన చిత్రరూపంలో కనిపించేది. కొన్నిసార్లు ఈచిత్రాలు



ఎంత స్పష్టంగా ఉండేవంటే ఏది నిజమైన వస్తువో ఏది తన ఊహో వేరుచేయడం ఆయనకు కష్టమయ్యేది. ఈక్రమంలో ఆయన తన ఊహల్లోనే సరికొత్త ప్రపంచాలను, నగరాలను, మనుషులను సృష్టించుకునే వారు. ఈ అభ్యాసమే తర్వాతి కాలంలో ఆయనకు అద్భుతమైన ఆవిష్కరణలు చేయడానికి పునాదిగా మారింది. ఆయనకు ఏదైనా కొత్తఆలోచన వస్తే,దానికి సంబంధించిన పూర్తిరూపాన్ని అది ఎలా పనిచేస్తుంది అనే విధానాన్నిమొదట తన ఊహల్లో నిర్మించుకునేవారు. ఆయంత్రాన్ని మనస్సులోనే నడిపిస్తూ,అందులో ఏవైనా లోపాలు ఉంటే అక్కడే సరిదిద్దేవారు. లాబొరేటరీలో ప్రయోగంచేయకుండానే, కేవలం తన ఊహలోనే ఆయంత్రం యొక్కపనితీరును వందశాతం ఖచ్చితత్వంతో లెక్కించేశక్తి గలవారు. టెస్లా ఆవిష్కరణలు మన రోజువారీ జీవితంలో ఉపయోగించే విద్యుత్, పరిశ్రమలు ,కమ్యూనికేషన్ మరియు అనేక ఆధునిక సాంకేతిక పరికరాల అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయి. టెస్లా అభివృద్ధి చేసిన ఆల్టర్నేటింగ్ కరెంట్ వ్యవస్థ వల్లవిద్యుత్ ను చాలాదూరాలకు తక్కువఖర్చుతో సరఫరాచేయడం సాధ్యమైంది. నేడు ప్రపంచం మొత్తం ఇదే విద్యుత్ పంపిణీ విధానంను ఉపయోగిస్తున్నారు. విద్యుత్ మరియు అయస్కాంత క్షేత్రలపై విస్తృత ప్రయోగాలు చేసి రొటేటింగ్ మాగ్నెటిక్ ఫీల్డ్ మరియు పోలిఫేస్ విద్యుత్ వ్యవస్థలను అభివృద్ధి చేశారు. టెస్లారూపొందించిన పరిశ్రమలు, ఫ్యాన్లు, పంపులు, వాషింగ్ మెషిన్లు మరియు ఇతర యంత్రాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. టెస్లా చేసిన రేడియో తరంగాలపై పరిశోధనలు వైర్ లెస్ కమ్యూనికేషన్ అభివృద్ధికిపునాదివేశాయి.దీనివల్ల రేడియో, టెలివిజన్,మొబైల్ కమ్యూనికేషన్ సాంకేతికతలు అభివృద్ధిచెందాయి.

రిమోట్ కంట్రోల్ ఆలోచన టెస్లా మెదల్లో చిగురించిన గొప్ప ఆలోచన.ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే పడవను తయారుచేసి ప్రదర్శించారు. ప్రస్తుతం టీవీ రిమోట్లు, డ్రోన్లుమరియు రోబోటిక్స్ ఈ సాంకేతికత ఉపయోగిస్తున్నారు. చిన్ననాటి నుండే టర్బయిన్లపై ఉన్న కుతూహలంతో బ్లేడ్లు లేకుండా నడిచే టెస్లా టర్బైన్ రూపొందించారు. అధిక ఓల్టేజి అధిక పౌనపుణ్యం గల విద్యుత్ ఉత్పత్తి చేసే టెస్లా కాయిల్ తయారుచేశారు. టెస్లాఎక్స్‌రే సాంకేతికత రంగంలో ఎన్నో అద్భుతమైన ప్రయోగాలు చేశారు. ఈరంగంలో ఆయన స్వతంత్రంగా పరిశోధనలు చేసి ప్రారంభదశలో ఎక్స్‌రే సాంకేతికత అభివృద్ధి చెందడానికి ఎంతో సహాయపడ్డారు. అధిక శక్తి కిరణాల సిద్ధాంతాలు పౌరులకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తు, శత్రు విమానాలను, సైనిక లక్ష్యాలను నాశనం చేయగలదని భావించారు.ఈ ఆలోచనే భవిష్యత్తులో వచ్చిన డైరెక్టెడ్ఎనర్జీ వెపన్స్ పరిశోధనలకు పునాది వేసింది. టెస్లా టెలిఫోర్స్ అనే భావనను ప్రకటించారు. ఇది చాలా దూరం వరకు అధిక శక్తి గల కణాల కిరణాన్ని పంపి అవి శత్రు విమానాలు లేదా సైనిక దళాలను తాకి తిరిగి వచ్చే సమయాన్ని బట్టి వాటి స్థానాలను స్థావరాలను ఖచ్చితంగా తెలుసుకొనే రక్షణ వ్యవస్థగా ఆయన వివరించారు. ఇదే తరువాతి కాలంలో రాడార్ వ్యవస్థకు మూలం అయింది. ఇలా టెస్లా ఆలోచనలు ఆధునిక విద్యుత్ నీరింగ్, ఆటోమేషన్ మరియు వైర్ లెస్ సాంకేతికతల అభివృద్ధికి ప్రేరణగా నిలిచాయి. ప్రపంచాన్నిమెరుగ్గా మార్చే సాంకేతికతను సృష్టించడమే శాస్త్రవేత్తల లక్ష్యం అని పేర్కొని భూగోళాన్ని వైర్లు లేకుండా విద్యుత్ ప్రసరణచేసి కాంతివంతం చేయాలన్న కలను కలగానే మిగిల్చి జనవరి 7 1943 లో తుది శ్వాస విడిచారు నికోల టెస్లా . ఆధునిక మనిషి రోజువారీ జీవన గమనంలో వాడే ప్రతి విద్యుత్ చర్యల వెనకాలా టెస్లా పరిశోధనల ప్రభావం ఉందని మానవాళి గుర్తించాలి.

**(10 జులై నికోల టెస్లా జయంతి సందర్భంగా)**

**బైరబోయిన వెంకటేశ్వర్లు**
**తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘం**

# చెడు కొలెస్ట్రాల్‌తోనే కాదు.. ఈ పరీక్షతోనూ గుండె ముప్పు గుర్తింపు

**చెడు కొలెస్ట్రాల్‌తోనే కాదు.. ఈ పరీక్షతోనూ గుండె ముప్పు గుర్తింపు**

**గుండెపోటు ప్రమాదాన్ని మరింత కచ్చితంగా అంచనా వేసే కొత్త పరీక్ష**

**సాధారణ కొలెస్ట్రాల్ పరీక్షతో పాటు అదనపు పరీక్షకు నిపుణుల సూచన**



గుండె ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి ఇప్పటివరకు సాధారణంగా చెడు కొలెస్ట్రాల్ స్థాయిలనే ఆధారంగా తీసుకుంటున్నారు. అయితే గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదాలను మరింత కచ్చితంగా గుర్తించేందుకు మరో కొత్త రక్త పరీక్ష ఉపయోగపడుతుందని తాజా పరిశోధన వెల్లడించింది. కొలెస్ట్రాల్‌ను మోసుకెళ్లే హానికర కణాల సంఖ్యను గుర్తించే ఈ పరీక్షతో దాగి ఉన్న గుండె ముప్పును ముందుగానే గుర్తించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

మన శరీరంలో మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొవ్వు పదార్థాలు ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ గుండెకు రక్షణ కల్పిస్తే, చెడు కొలెస్ట్రాల్ అధికమైతే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.


సాధారణంగా చేసే కొలెస్ట్రాల్ పరీక్షలో మొత్తం కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను కొలుస్తారు. అయితే ఇద్దరిలో చెడు కొలెస్ట్రాల్ ఒకే స్థాయిలో ఉన్నప్పటికీ, కొలెస్ట్రాల్‌ను మోసుకెళ్లే హానికర కణాల సంఖ్య మాత్రం వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. ఈ తేడాను గుర్తించడంలో కొత్త పరీక్ష కీలకంగా పనిచేస్తుందని పరిశోధకులు వెల్లడించారు.


ఈ పరీక్షలో రక్తంలో గుండెకు హాని చేసే కణాల సంఖ్యను నేరుగా లెక్కిస్తారు. అందువల్ల సాధారణ పరీక్షల్లో ప్రమాదం కనిపించని కొందరిలో కూడా గుండెపోటు ముప్పును ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా మధుమేహం, ఊబకాయం, అధిక ట్రైగ్లిజరైడ్లు, కుటుంబంలో గుండెజబ్బుల చరిత్ర ఉన్నవారికి ఈ పరీక్ష మరింత ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణ పరీక్షల్లో ఫలితాలు సాధారణంగానే ఉన్నప్పటికీ, దాగి ఉన్న ప్రమాదాన్ని ఇది బయటపెట్టగలదని వారు పేర్కొంటున్నారు.

అయితే ప్రస్తుతం అందరికీ ఈ పరీక్ష అవసరం లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. తొలి దశలో సాధారణ కొలెస్ట్రాల్ పరీక్షే సరిపోతుందని, అవసరమైతే వైద్యుల సలహా మేరకు ఈ అదనపు పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు.

నిపుణుల అభిప్రాయం ప్రకారం గుండెజబ్బుల ప్రమాదం తక్కువగా ఉన్నవారిలో ఈ పరీక్ష విలువ నిర్దిష్ట పరిమితికి లోపే ఉండాలి. ఇప్పటికే గుండె సమస్యలు లేదా మధుమేహం ఉన్నవారిలో మరింత తక్కువగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. మరో ప్రత్యేకత ఏమిటంటే, ఈ పరీక్ష కోసం తప్పనిసరిగా ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు.

భారతీయుల్లో మధుమేహం, ఊబకాయం, జీవక్రియ సంబంధిత సమస్యలు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో గుండెజబ్బులను ముందుగానే గుర్తించడంలో ఈ కొత్త రక్త పరీక్ష భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.







# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

ఆదిలాబాద్ మహా: జిల్లాలోని గ్రామాలను అభివృద్ధితో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు.గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో "గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (విబిజి రామ్ జీ), ఘన వ్యర్థ నియమాలు 2026" పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేవలం ఒక సంవత్సరానికే కాకుండా, ప్రజాప్రతినిధుల పదవీ కాలానికి సరిపడేలా సుదీర్ఘ సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద గత ఉపాధి హామీ కంటే ఎక్కువ మెటీరియల్ పనులకు అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల కొత్త గదులు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, శౌచాలయాల నిర్మాణం, వాటి మరమ్మతు పనులను ఈ పథకం ద్వారా చేపట్టవచ్చని వివరించారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా సొంతగా ఆదాయంపై సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్సులు, బిల్డింగ్ పర్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా గ్రామాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించవచ్చని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం డ్రైనేజీల క్లీనింగ్, వీధుల శుభ్రత చేపట్టాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీలలో నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుద్ధి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు నీటి సంరక్షణలో అవార్డు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. గుట్టల ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, పొలాల్లో నీటి కుంటలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంచాలన్నారు. వీటితో పాటు గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలన, పిల్లలందరినీ బడికి పంపించడం, మత్తు పదార్థాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి సామాజిక బాధ్యతలపై గ్రామాల్లో తీర్మానాలు చేసి కఠినంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.

అంతకుముందు అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ నరసింహులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీఓ రమేష్, డీఆర్డీఓ రవీందర్, జడ్పీ సీఈఓ రవి, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, గ్రామీణ నీటి సరఫరా ఈఈ చంద్రమోహన్, డిఎల్పిఓలు ఫణిందర్,

ప్రభాకర్, జిల్లా, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెరగాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెరగాలి**

భైంసా మహా : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం బాసర, తానూర్, కుబీర్, మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.ముందుగా బాసర గ్రామపంచాయితీ ఆవరణలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం తానూరు మండలం సింగన్ గావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు, తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారములు నింపుటలో ఓటర్లకు సహాయం చేయాలని బిఎల్ఓ లకు అధికారులకు సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ లో వివరాలను పరిశీలించారు. సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ లు వెంకటేష్ గౌడ్, అన్నపూర్ణ, సాయినాథ్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# క్రీడలకు అత్యంత ప్రాధాన్యత

ఆదిలాబాద్ మహా : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోనీ జిల్లా క్రీడా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన హై జంప్ మ్యాట్, మల్టీ డిజిటల్ ప్యానెల్ యూనిట్ లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ మీట్ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ కోరిన విధంగా, జిల్లాలోని నేషనల్, స్టేట్ మెడలిస్టుల సౌకర్యార్థం ప్రభుత్వ గ్రాంట్ నిధులు 4.95 లక్షలతో హై జంప్ మ్యాట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు ఇప్పటికే యూనిఫామ్స్, షూస్ వంటి కనీస వసతులు కల్పించామని, విద్యాశాఖ అందజేసిన డిజిటల్ ప్యానెల్ యూనిట్ లను ప్రారంభించుకోవడం జరిగిందని వివరించారు. త్వరలోనే స్విమ్మింగ్ పూల్ వద్ద టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, అలాగే స్కూల్‌లో గీజర్, పెయింటింగ్ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు కోరిన విధంగా డైట్ సమస్యను కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామన్నారు. జిల్లాకు గర్వకారణమైన ఈ స్పోర్ట్స్ స్కూల్ నుండి ఎంతో మంది క్రీడాకారులు మెడల్స్ సాధిస్తున్నారని కొనియాడారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' లాంచ్ కానుందని చెప్తూ.. జిల్లాలో జూడో, రెస్లింగ్, కబడ్డీ మ్యాట్లను సిఎస్ఆర్ నిధుల ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి క్రీడా మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు క్రీడా విద్యార్థుల హై జంప్ ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి పార్థసారథి, కోచ్‌లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# చదువుతో ఉన్నత స్థానం

ఆదిలాబాద్ మహా: బాల్యం నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం గాదిగూడ మండలం లోకారి గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు.విద్యార్థులు, ఆదివాసీ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్య, ఉపాధి, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. లోకారి గ్రామంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, విద్యార్థుల కోసం అధునాతన సదుపాయాలతో కూడిన లైబ్రరీని పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసి ప్రారంభించారు. ప్రతిరోజూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, లైబ్రరీలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరని తెలిపారు. అనంతరం ఎస్పీ విద్యార్థులతో కలిసి సామూహిక భోజనం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి చదువులు, లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల




గురించి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి చదువులు, లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.పాఠశాల విద్యార్థులకు మేధాశక్తిని పెంచే విధంగా చెస్, బిజినెస్, పలు క్రీడా సామాగ్రిని అందజేసి చదువుతోపాటు ఆటలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, నార్నూర్ సీఐ అంజమ్మ, గాదిగూడ ఎస్సై రమ్య, ఆదివాసీ నాయకులు దౌలత్‌రావు తుడసం, అమృతరావు, దుర్గు పటేల్, ఉపాధ్యాయుడు శేఖర్, విద్యార్థులు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు ఇస్తే లక్కీ లాటరీలు ఏమీ ఉండవు...!

- **డైరెక్ట్ గృహాలకు వెళ్లి పాలు పొంగించుకోవడమే**
- **రికమెండిషన్ గురించి ఎవరికీ చెప్పొద్దు**
- **ఆలస్యంగా బయటపడ్డ అధికార పార్టీ దళారీ నేత వాయిస్ రికార్డు**




**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ గృహాల మంజూరు జాబితాలో డబ్బులు ఇస్తే లక్కీ లాటరీలు ఏమీ ఉండవు...! అంటూ కొంతమంది మహిళలకు అధికార పార్టీకి చెందిన ఓ దళారీ నేత వాయిస్ రికార్డు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక డబుల్ బెడ్ రూమ్ గృహానికి 60 నుండి 70 వేల రూపాయలు తీసుకుంటున్నారు. కానీ నేను 50 రూపాయలకు మీ కొరకు సెట్ చేశాను. నీకు మరో మహిళకు కలిసి లక్ష రూపాయలకు డిసైడ్ చేశాను. అందులో భాగంగా ఈరోజు సార్ కు పార్టీ ఇచ్చేది ఉంది. సాయంత్రం నాలుగు గంటల వరకు సార్ కార్యాలయంలో ఉంటారు. అతనిని తీసుకొని ఎక్కడికైనా వెళ్లాలి అంటూ దళారి నేత మహిళలకు చెప్పడం గమనార్హం. అంతే కాకుండా తాను రిక్రూమెంట్ చేసినట్లు ఎవరికీ చెప్పొద్దు. మీరు వెళ్లి ఆ గృహాలలో పాలు పొంగించుకునే వరకు ఈ విషయం బయటపడొద్దు. అంటూ పలువురు మహిళలతో ఓ నేత మాట్లాడిన వాయిస్ రికార్డ్ లో ఉంది.

**ఏ పథకం వచ్చినా "చోటే బడే"లు ముందు వరుసలో**

ప్రభుత్వం నిరుపేదల గురించి ఏ పథకం వచ్చిన మందమర్రి పట్టణంలో "చోటే బడే"లు ముందు వరుసలో ఉంటున్నారని పట్టణంలో ఆరోపణలు వెలివెత్తుతున్నాయి. ప్రభుత్వ పథకాలైనటువంటి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్ల మంజూరు, సింగరేణి ఓసీలు, సోలార్ ప్లాంట్ లో ఉద్యోగాలు, డబుల్ బెడ్ రూమ్ గృహాల మంజూరు తదితరులలో పనులు చేపిస్తామని అమాయక ప్రజలను నమ్మించి విచ్చలవిడిగా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు కథనాలు వినిపిస్తున్నాయి.

**పదవి విరమణ పొందిన కార్మికులకు కొత్త రేషన్ కార్డులు**

సింగరేణి కాలరీస్ కంపెనీలో విధులు నిర్వహించి ఈ మధ్య పదవి విరమణ పొందిన కార్మికులకు కొత్త రేషన్ కార్డుల మంజూరు కొరకు చాలామంది దరఖాస్తులు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే సదరు కార్మికులకు సంవత్సరానికి రెండు లక్షల రూపాయల కంటే ఎక్కువ పెన్షన్ వస్తుందనే నేపంతో రెవెన్యూ అధికారులకు దరఖాస్తుదారులకు రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదు. ఈ సమస్యను తెలుసుకున్న "చోటే బడే"లు మీ సమస్య తీరుస్తాం అంటూ మాజీ సింగరేణి కార్మికులకు నమ్మ పలికి ఒక రేషన్ కార్డు మంజూరుకు 30 వేల రూపాయలు చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. సదరు వ్యక్తులు మందమర్రి మండలం రెవెన్యూ అధికారుల పోర్బలంతో దాదాపు 50 మంది అనర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేపించినట్లు పుకార్లు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఎనిమిది నెలల కాలంలో రేషన్ కార్డుల దందాలో 7 లక్షల రూపాయల మేరకు వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం.

**మద్యం మత్తులో నిత్యం**

ఇలా ప్రజల నుండి వసూలు చేసిన డబ్బులతో నిత్యం "చోటే బడే"లు మద్యం మత్తులో మునిగి తేలుతున్నట్లు సమాచారం. మీరు ఇచ్చే మందు, మాంసం, విందు పార్టీలకు ప్రభుత్వాధికారులు, అధికార పార్టీ నేతలు, పాత్రికేయులు సైతం హాజరవుతున్నట్టు తెలుస్తోంది. వీరి వల్ల మచ్చలేని చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి చెడ్డ పేరు వస్తుందని కాంగ్రెస్ అభిమానులు ఆందోళనకు వ్యక్తం చేస్తున్నారు.



# సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మరావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించి సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, రైస్ మిల్లర్లు లక్ష్య సాధన దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు చేయవలసిన చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని, డీలర్లకు కేటాయించిన ప్రకారంగా ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని తెలిపారు. డిఫాల్టర్లు త్వరగా బకాయిలు 70 శాతం వరకు చెల్లించాలని, ఆగస్టు 31 లోగా సి ఎం ఆర్ డెలివరీ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు

# మందమర్రిలో గుడుంబా అమ్మకాలను నియంత్రించాలి

- **దొరల బంగ్లా ఏరియా బస్తీవాసుల డిమాండ్**

**మందమర్రి, మహా:** మందమర్రి మునిసిపాలిటీలో గుడుంబా అమ్మకాలను నియంత్రించాలని మూడవ జోన్ దొరల బంగ్లా ఏరియా ప్రజలు డిమాండ్ చేసుకున్నారు. గురువారం దొరల బంగ్లా ప్రాంతంల బస్తీవాసులు గొర్రె రాం చందర్, కనకం రవీందర్, బచ్చలి సురేందర్, బత్తుల సరిత లు గుడుంబా విక్రయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు గత 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో గుడుంబా తయారీ, విక్రయాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. పలుమార్లు స్థానిక పోలీసులకు, బెల్లంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులకు ఫిర్యాదులు చేసిన పెద్దగా మార్పు రాలేదని పేర్కొన్నారు. అక్రమ గుడుంబా విక్రయాలను ప్రోత్సహిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీరి అశ్రద్ధ ద్వారా గుడుంబా మత్తుకు బానిసలవుతున్న వారి సంఖ్య రోజురోజుకు ఇక్కడ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహమ్మారి వల్ల ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వారు వెల్లడించారు. గత రెండేళ్లలోనే గుడుంబా సేవించి అనారోగ్యానికి గురై దాదాపు 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో మరిన్ని కుటుంబాలు విషాదంలో మునిగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. దొరల బంగ్లా ప్రాంతంలో గుడుంబా తయారీ కేంద్రాలు, విక్రయ స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆబ్కారీ శాఖ అధికారులను కోరారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని బస్తీవాసులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంపత్, వెంకటేశ్వర్లు, బాసాని శ్రీనివాస్‌తో పాటు పలువురు భాస్తివాసులు పాల్గొన్నారు.





# పారిశుధ్యంపై ఫోకస్

ఆదిలాబాద్ మహా: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాలలో ఆయిల్ స్ప్రేయింగ్, శానిటైజేషన్ స్ప్రేయింగ్ వంటి చర్యలను నిరంతరం చేపడతామని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష తెలిపారు.ఆధునిక సాంకేతికతతో కూడిన 18 నూతన స్ప్రేయర్ పంపులను కొనుగోలు చేసి గురువారం ఆమె పంపిణీ చేసారు. పట్టణంలోని 49 వార్డుల్లో ప్రతి శుక్రవారం నిర్వహించే "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, మెప్మా సిబ్బంది కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఇంటిలో కూలర్లు, నీటి డ్రమ్‌లు, కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా దోమల లార్వా వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు.రాబోయే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, వైస్ చైర్మన్ రోహిత్, ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, కౌన్సిలర్లు పర్వేజ్, మెహబూబ్, శానిటేషన్ ఎస్ఐ శంకర్, నారాయణరెడ్డి, శానిటేషన్ జవాన్లు, వర్కర్లు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 16,19,23 సెలక్షన్స్

బెల్లంపల్లి , మహా : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఈ నెల 12వ తేదీన మంచిర్యాల జిల్లా మరియు కొమరం భీం జిల్లా స్థాయి అండర్ 16 అండర్ 19 అండర్ 23 క్రికెట్ ఎంపిక పోటీలు జరుగుతాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పై డిమల్ల నర్సింగ్, కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు ,సీనియర్ కోచ్ జాడి శేఖర్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలు స్థానిక శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో జరుగుతాయని వారు తెలిపారు. సెలక్షన్ కి వచ్చే క్రీడాకారులు తమ వెంట సొంత కిట్ బ్యాగు, వైట్ డ్రెస్ ,ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలి అని వారు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు హైదరాబాదులో నిర్వహించే జోనల్ ఎంపిక పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. వివరాలకు 6281420180, 798109809 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.



# మానవత్వాన్ని చాటిన సీనియర్ సిటిజన్స్

బెల్లంపల్లి, మహా: బెల్లంపల్లి నెంబర్ 2 గ్రౌండ్ సీనియర్ సిటిజన్స్ వాకర్స్ మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక టేకుల బస్తీకి చెందిన నరసింహులు భార్య ప్రవంతి అనారోగ్య పరిస్థితుల్లో కరీంనగర్ లోని ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నందువల్ల వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన సీనియర్ సిటిజన్స్ విరాళాలు సేకరించి ఆమె వైద్యం కోసం గురువారం అందజేశారు. మొత్తం 17700 రూపాయలను విరాళాలుగా సేకరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్



# విద్యార్థుల హక్కుల కోసం పోరాటం

**రాజేంద్రనగర్ మహా ;** జాతీయ విద్యార్థి దినోత్సవ సందర్భంగా 78 వ ఏబీవీపీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను శంషాబాద్ లో ఘనంగా గురువారం నిర్వహించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులతో కలిసి శంషాబాద్ చౌరస్తా నుంచి ఆర్ బి నగర్ గ్రౌండ్ వరకు వందలాదిమంది విద్యార్థులు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ కరుణాకర్ పాల్గొన్నారు. కరుణాకర్ మాట్లాడుతూ 1949 జూలై 9న ఆవిర్భవించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశంలోని కోట్లాదిమంది విద్యార్థులను చైతన్యవంతం చేస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలు హక్కుల కోసం నిరంతరం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పరుశురాం, భరత్, అఖిల్, దినేష్, మనీష్, వేణు, తిరుపతి, వెంకట్, భరద్వాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు..

**కాలం చెల్లిన వంట నూనెలు, తిను బండారాలు, ఆహార ఉత్పత్తులను సీజ్...**

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఫేమస్ డిస్ట్రిబ్యూటర్స్ గోదాం పై హెచ్ ఫాస్ట్ ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందంతో కలసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో గడువు ముగిసిన వంట నూనెలు, తిను బండారాలు, కాలం చెల్లిన ఆహార ఉత్పత్తులను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ఆహార ఉత్పత్తులను, వంట నూనెల నమూనాలను పరీక్షకుల కోసం ప్రయోగాశాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈఉత్పత్తులను విక్రయానికి నిలువ ఉంచారా, లేక ఇతర వ్యాపారస్తులకు తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారా అనే అనుమానం అధికారులు వ్యక్తం చేశారు. పరీక్షల నివేదిక వచ్చిన అనంతరం సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్ ఫాస్ట్ ఫుడ్ అధికారులు తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని శంషాబాద్, కోత్వాల్ గూడ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై గురువారం బిఆర్ఎస్ పార్టీడివిజన్ అధ్యక్షులు, జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ, పరిశుద్ధ, ఫిరంగినాళాలలు, చెత్త సేక రణలో పలు సమస్యల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో శానిటేషన్ పారిశుద్ధ సమస్యలు పెరిగి, శంషాబాద్ ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కమిషనర్ చంద్రకళను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోన్నమొల్ల శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, బుచ్చిరెడ్డి, జయసింహ,రాజేందర్, మురళి గౌడ్, పరంధాములు, పవిత్ర సాగర్, చరణ్, రమేష్, రమేష్ రాథోడ్,దీపక్ గౌడ్, సాయి, బాలు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు స్నేహపూర్వక పోలీసింగ్,సాంకేతిక సేవలను చేరవేయాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**బెల్లంపల్లి, మహా:** గిరిజనులకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవల తోపాటు సాంకేతిక సేవలను చేరవేయాలనిరామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిపి అంబర్ కిషోర్ ఝా గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల జోన్‌లోని మాదారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు మంచిర్యాలజోన్ డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య,ఎస్ఐ సౌజన్య పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం సాయుధ దళ పోలీసుల గౌరవ వందనాన్ని పోలీస్ కమిషనర్ స్వీకరించారు.తదనంతరం స్టేషన్ పరిసరాలు,వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, పోలీస్ స్టేషన్ ఆవరణలోని క్రీడా ప్రాంగణం, పోలీస్ వాహనాల నిర్వహణను పరిశీలించారు. ప్రతి పోలీస్ వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, ట్రాఫిక్ కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ (హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్) తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందినప్పుడు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తత, స్పందన తీరు ఎలా ఉందో కమ్యూనికేషన్ సెట్ ద్వారా మాట్లాడి తెలుసుకున్నారు. స్టేషన్ కు సంబంధించిన రికార్డులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలను పరిశీలించారు.పోలీస్ స్టేషన్ సంబంధించిన పూర్తి రికార్డ్స్ ,పెండింగ్ కేసులు తదితర వివరాలను ఎస్ఐ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బందితో మాట్లాడి వారి విధులు,
ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ
విస్తారమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సేవలందిస్తున్న మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మరింత స్నేహపూర్వకంగా, అందుబాటులో ఉండే పోలీసింగ్ అందించాలని సూచించారు. గిరిజనులతో సున్నితంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని విశ్వాసాన్ని పెంపొందించాలని ఎస్ఐ, సీఐలకు ఆదేశించారు. పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సేవలు, సీసీటీఎన్ఎస్,హాక్ ఐ, టీఎస్ కాప్ వంటి యాప్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. అలాగే పాస్‌పోర్ట్ ధృవీకరణ, వివిధ ధ్రువపత్రాల జారీ,ఫిర్యాదుల స్వీకరణ వంటి ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాలని సూచించారు.... యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..
గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు,వాటి ప్రయోజనాలు, ప్రాముఖ్యత,సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ ఎస్ఐలు తమ పరిధిలో విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించి నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. భారీ వర్షాలు,ప్రకృతి వైపరీత్యాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్) సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

**పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరం**

ఎంతో ప్రాముఖ్యత ఉందని రామగుండం సిపి అంబర్ కిషోర్ జా పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్అధికారులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. మాదారం పోలీస్ స్టేషన్ నిర్వహణ, సౌకర్యాలు,పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ఎస్ఐ, సీఐతో పాటు స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి చంద్రయ్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి జిల్లా విద్యాశాఖ, మహిళశిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. అంగన్వాడిలోని పిల్లలు ప్రభుత్వ పాఠశాలలలో చేరేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఆహారం రుచిని ఉపాధ్యాయులు ముందుగా పరీక్షించాలని, వంట మనుషులకు, సహాయకులకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఈసారి పిల్లలకు అందించే ప్రోగ్రెస్ కార్డులను హోలీస్టిక్ కార్డులుగా అందించడం జరుగుతుందని, నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే ఆరోపణలో వాస్తవం లేదు.!

- విమర్శలను తిప్పి కొట్టిన మల్ రెడ్డి రాంరెడ్డి
- ఫార్మాసిటీ భూముల్లో రైతులను మోసం చేసింది మీరు కాదా.!
- మంచిరెడ్డి వాస్తవాలు తెలుసు-కొని మాట్లాడాలన్నా కాంగ్రెస్ నాయకులు

**ఇబ్రహీంపట్నం జూలై 9 మహా:** మునగనూరు సర్వే నంబర్ 44 లో కబ్జా చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి అన్నారు. గురువారం జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బుధవారం మాట్లాడుతూ మునగనూరు సర్వే నంబర్ 44 లో, కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాకు పాల్పడ్డారని చేస్తున్న ఆరోపణలలో ఏమాత్రం వాస్తవం లేదని అవన్నీ అవాస్తవ్వాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులను బదనాం చేయడానికి మాత్రమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మల్ రెడ్డి రాంరెడ్డి అన్నారు. ప్రజాప్రయోజనాలకు ఉపయోగానికి వచ్చే ప్రభుత్వ భూములను కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాంరెడ్డి అన్నారు. ఒక ఎకరం కాదు ఒక గజం కూడా ఎక్కడ కూడా కబ్జాకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్పడలేదని తేల్చి చెప్పారు. గత 10 సంవత్సరాల కాలంలో భూకబ్జాలకు పాల్పడ్డది మంచిరెడ్డి కిషన్ రెడ్డి అని, అతను ఈరోజు కాంగ్రెస్ నాయకులు కబ్జాలకు పాల్పడ్డారని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని రామ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భూ కబ్జాలకు అవినీతికి పాల్పడ్డదే బీఆర్ఎస్ నాయకులు అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని ఫార్మాసిటీ పేరిట భూ అక్రమాలకు పాల్పడ్డది మీరు కాదని, పేద రైతులను మోసం చేసింది మీరు కాదని ప్రశ్నించారు, నియోజకవర్గంలోని భూములను దోచుకొని దాచుకొని ఈరోజు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మీద కాంగ్రెస్ కార్యకర్తల మీద గాని బురదజల్లే ప్రయత్నం చేయడం మానుకోవాలని, లేదంటే తగిన రీతిలో బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమంపై నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించామే తప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎక్కడ కూడా భూకబ్జాలకు పాల్పడలేదని తేల్చి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మాపై తప్పుడు ఆరోపణలు చేయడమే లక్ష్యంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారని, ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని మల్ రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కొషికే ఐలయ్య, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, మంకాల దాసు, సామ భీమ్ రెడ్డి, సిహెచ్ భాస్కరాచారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

- పేదలు దానిని సద్వినియోగం చేసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి
- మంచాల మండలంలో 40మంది లబ్ధిదారులకు రూ.14,47,000ల చెక్కులు మంజూరు



**ఇబ్రహీంపట్నం జూలై 9 మహా:**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని దానిని నిరుపేదలు సద్వినియోగం చేసుకొని సాయం పొందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, మంచాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ. 1447000ల విలువైన చెక్కులు మంజూరు కాగా, గురువారం వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని, అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని కొనియాడారు. ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలంల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైరిక రమాకాంత్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ పంది రమేష్, మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, మార సురేష్, ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్ తదితరులు పాల్గొన్నారు



# శంషాబాద్ జోన్ పరిధిలో వర్షాల పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలి

**జోనల్ కమిషనర్ చంద్రకళ ఆదేశాలు...**

**రాజేంద్రనగర్ మహా ;** ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ చంద్రకళ అధికారులను ఆదేశించారు. శంషాబాద్ జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కమిషనర్ చంద్రకళ సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో హెచ్ ఎమ్ డబ్ల్యూ ఎస్ఎస్ బి, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ, హైడ్రా, నీటిపారుదల శాఖ, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, హెచ్ఎండిఏ, హెచ్ ఆర్ డి సి ఎల్, హెచ్ జి సి ఎల్, ఐ ఆర్ బి ఇన్ఫ్రా, ట్రాఫిక్ పోలీసులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. శంషాబాద్ జోన్ పరిధిలో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలి. వాటికి నివారణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. రహదారులపై గుంతలను పూడ్చాలి, నాళాలు, వాటర్ డ్రైన్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణ వేగవంతం చేయడంతో పాటు చెరువులు కుంటలు ఫిరంగి నారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధాన నాళాలలో పనులను త్వరగాతిన పూర్తి చేసి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప, వివిధ శాఖలకు సంబంధించిన డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బొలెరో వాహనం బీభత్సం..

**బస్ స్టాప్ లో నిలుచున్న ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలో దోమ సుమ, చిలకమర్రి సువర్ణ,లు పనులు ముగించుకుని సాతాంరాయి బస్ స్టాప్ లో నిలుచున్నారు. కర్ణాటక నుంచి మిర్చి లోడుతో హైదరాబాద్ వస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి సాతాంరాయి బస్ స్టాప్ లో ఆగి ఉన్న మహిళలపై దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు మహిళలు దోమల సుమ (55) చిలకమర్రి సువర్ణ (66) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు హటావుటిన చనిపోయిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. భారీగా ట్రాఫిక్ జాం కావడంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ని క్లియర్ చేశారు.

**ఎన్నో ప్రాణాలను బలికోన్న నేషనల్ హైవే 44 పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళనలు...**

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలంటూ మాజీ కౌన్సిలర్ సునీతా దయానంద ఆధ్వర్యంలో నేషనల్ హైవే 44



సాతాంరాయిలో గ్రామస్తులు గురువారం ఆందోళన నిర్వహించారు.
సంవత్సరానికి ఆరు నుంచి ఎనిమిది మంది వరకు సాతాంరాయి రోడ్డు ప్రమాదంలో అసువులు బాసుతున్నారు.అరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు బస్తీలకు, గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా అండర్పాస్ లు నిర్మించారు.ఎలాంటి ముందస్తు (రోడ్డు దాటేందుకు ) చర్యలు లేకుండా నిర్మించారు. కార్మికులు కర్షకులు ప్రతిరోజు తమ పనులను ముగించుకొని ఇంటికి రావడానికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వస్తున్నారు.ఈసాతాంరాయి రోడ్డు ప్రమాదంలో ఎందరో అభాగ్యులు

అనాధలుగా మిగిలారని పోలీసులతో స్థానిక నాయకులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు సముదాయించి వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

**ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ ..** ఫుట్ ఓవర్ బ్రిడ్జి ల కోసం టెండర్లు పిలిచారు. టెండర్ లో కేవలం ఒకరే పాల్గొనడంతో టెండర్లు క్యాన్సిల్ అయ్యాయి. అతి త్వరలోనే 7 కోట్ల నిధులతో 3 ఫుట్ ఓవర్ బ్రిడ్జి లు త్వరలో నిర్మాణానికి శ్రీకారం చుడతారన్నారు. నేషనల్ హైవే అధికారులకు ట్రాఫిక్ కి అంతరాయం కలగడంతో పాటు ఎంతోమంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిద్ధాంతి వద్ద ఒకటి,సాతాంరాయి లో మరొకటి, గగన్ పహాడ్ వద్ద ఇంకొకటి ఏర్పాటు చేయనున్నారు.

# డంపింగ్ యార్డ్ విషయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చట్టపరమైన చర్యలు

**జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి**

**కుషాయిగూడ , మహా :** డంపింగ్ యార్డ్ విషయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి హెచ్చరించారు. ఏసిపి ఈ మీడియాతో మాట్లాడుతూ వాట్సాప్ లలో సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్న డంపింగ్ యార్డ్ కు సంబంధించి వాహనాలను ఆపుతామని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తామని చెబుతున్న వారికి దీనికి సంబంధించి ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతమైనటువంటి నిరసన మాత్రమే చేయాలని, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత మార్గంలో నిరసన తెలుపుకోవచ్చునని తెలిపారు. ఎవరైనా చట్టానికి అతీతంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీనడ్డా కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రాంచందరావు, ఎంపీలు డీకే, అరుణ,లక్ష్మణ్, శ్రీవర్ధన్ రెడ్డి విమానాశ్రయంలో ఆయనని కలిసి పుష్పగుచ్చలు అందజేశారు.కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాకతో కార్యకర్తలు ముఖ్య నాయకులతో విమానాశ్రయం పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి.



# షేర్ ట్రేడింగ్ పేరుతో రూ.1.56 లక్షల టోకరా

**పోలీసులను ఆశ్రయించిన బాధితుడు**

**కుషాయిగూడ, మహా :** ఆన్‌లైన్ షేర్ మార్కెట్‌లో భారీ లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి రూ.1.56 లక్షలు కాజేసిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మౌలాలి కృష్ణనగర్ కాలనీకి చెందిన వెంకట శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జూన్ 15న బాధితుడికి వాట్సాప్ ద్వారా షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ సందేశాలు వచ్చాయి. అనంతరం ఓ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్‌లో చేర్చి నకిలీ లాభాల స్క్రీన్‌షాట్‌లు, తప్పుడు సెబీ రిజిస్ట్రేషన్ వివరాలు చూపిస్తూ నమ్మించారు. గ్రూప్ నిర్వాహకుల సూచనల మేరకు బాధితుడు బీఆర్ నోవా యాప్‌లో కేవైసీ పూర్తి చేసి, విశ్లేషకుడిగా పరిచయం చేసుకున్న వ్యక్తి సూచనలతో పలుమార్లు బ్లాక్ ట్రేడింగ్ పేరుతో మొత్తం రూ.1.56 లక్షలు పెట్టుబడి పెట్టాడు.యాప్‌లో పెట్టుబడులపై భారీ లాభాలు చూపించడంతో మరింత నమ్మకం కలిగింది. అయితే తర్వాత వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యుల మొబైల్ నంబర్లను పరిశీలించగా అవి నకిలీవని లేదా అందుబాటులో లేవని గుర్తించాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బస్సు బొలెరో ప్రమాదంలో ఒకరి మృతి..

- **ఇద్దరికి సీరియస్.. వరంగల్ తరలింపు**
- **బాధితులకు అండగా ఉంటారన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ మహా:** ఆర్టీసీ బస్సు బొలెరో ప్రమాదంలో బీహార్ కూలీలకు తీవ్ర గాయాలు ఒకరు మృతి చెందిన ఘటన వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో చోటుచేసుకుంది. బీహార్ కు చెందిన కూలీలు పనుల నిమిత్తం వాహనంలో వెళ్ళొస్తుండగా అనుపురం వద్దకు రాగానే ప్రమాదం సంభవించింది. వాహనంలో 23 మంది బీహార్ కూలీలు ఉండగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కూలీల వద్దకు చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో బొలెరో వాహనంలో కూలీలు ఉన్నారని, వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

# నేటి విద్యాసంస్థల బంద్ సహకరించండి

**సమస్యలపై ఎంఈవోకు వినతి**



**కారేపల్లి, మహా :** విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు సహకరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ )మండల అధ్యక్షుడు చిలుముల భరత్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ కోరారు. ప్రయివేటు విద్యా సంస్థల ఫీజు దోపిడిని నివారించాలని, ప్రభుత్వ బడులలో వసతుల కల్పన, ఫీజు రియాంబర్స్ మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సింగరేణి మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పాఠశాలలో బంద్ పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూళ్లు, పాఠశాలలు, కళాశాలలో కేజీ టు పీజీ వరకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ స్టైఫండ్, బిల్లులు, కాస్మోటిక్ చార్జెస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ, 23 వేల పైగా పాఠశాల మూసివేత, కార్పొరేట్ విద్యను అరికట్టాలన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక ధరలకు అమ్ముతున్న పుస్తకాలు, యూనిఫామ్ లను సరసమైన ధరలకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని దానిలో భాగంగా నిర్వహిస్తున్న బంద్ ను జయప్రదం చేయాలని కోరారు.



# ఎంపీ రవిచంద్రను కలిసినిన బీఆర్ఎస్ నాయకులు

**కారేపల్లి , మహా:** రాజ్యసభ సభ్యులు బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు లను సింగరేణి మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం కలిశారు. ఖమ్మంలో ఎంపీ రవిచంద్రను కలిసిన నాయకులు ఆయనను శాలవతో సన్మానించారు. మండలంలో పార్టీ పరిస్థితిని ఎంపీకి వివరించారు. ఎంపీ, ఎమ్మెల్సీ తాతా మధు నిధులతో అభివృద్ధి పనులు మంజూరు చేయాలని విన్నవించారు. ఎంపీని కలిసిన వారిలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, కొత్తతండా సర్పంచ్ దారావత్ మంగీలాల్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, బానోత్ రాందాస్, మాలోత్ పడిత్యా తదితరులు ఉన్నారు.



# కస్తూరిబా విద్యార్థులకు ప్రశంస పత్రాలు

కారేపల్లి , మహా: కారేపల్లి కస్తూర్బా విద్యార్థులు అత్యధిక హాజరు శాతం కలిగి ఉండడంతో వారికి స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) ప్రశంస పత్రాలను అందజేసినట్లు విద్యాలయ స్పెషలాఫీసర్ ఝాన్సీ సౌజన్య తెలిపారు. కస్తూర్బా విద్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్(ఫేస్ ఇకగ్నైజేషన్ సిస్టం) హాజరును అమలు చేస్తున్నారు. కారేపల్లి కస్తూర్బా విద్యార్థులు 90 శాతం హాజరు కలిగి ఉండడంతో వారికి ఎస్పీడీ ప్రశంస పత్రాలు పంపినట్లు విద్యాలయ ఎస్ఓ తెలిపారు. ఖమ్మం జిల్లాలో 14 కస్తూర్బా విద్యాలయాలు ఉండగా కారేపల్లి కస్తూర్బా విద్యాలయం కు అధిక సంఖ్యలో ప్రశంస పత్రాలు వచ్చినట్లు స్పెషలాఫీసర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

## డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలంటూ...

# 11 న చెత్త లారీలు బంద్

- **యాంటీ డంపింగ్ యార్డ్ దమ్మాయిగూడ కార్యక్రమానికి సంఘీభావం.**
- **ఈనెల 10 నుండి 20 వరకు పాదయాత్రలు: చైర్మన్ షేక్షావలి.**



**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ చెత్త డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చెత్త లారీల బంద్ కార్యక్రమం విజయవంతం చేయాలని చైర్మన్ షేక్షావలి పిలుపునిచ్చారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ పట్ల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి తదనంతరం డంపింగ్ యార్డ్ సమస్య పట్ల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 11వ తేదీన చెత్త లారీల బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ పేర్కొన్నారు. జవహర్ నగర్ పరిధిలోని ప్రగతి నగర్ నీలం రామచంద్రయ్య భవన్లో చెత్త లారీల బందు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా జులై 26వ తేదీన చేపట్టబోయే కార్యక్రమాలపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి, కో కన్వీనర్లు కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాంటీ డంపింగ్ యార్డ్ దమ్మాయిగూడ జేఏసీ నేతలు గత 11 సంవత్సరాలుగా లక్షలాది మంది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డంపింగ్ యార్డ్ తొలగింపుకై న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తున్నారని, మే 4వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం యాంటీ డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారం కోసం హామీ ఇచ్చి రెండు నెలలు పూర్తయినా ఎలాంటి స్పందన లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా ఈనెల 11వ తేదీన చెత్త లారీల బందుకు పిలుపులో భాగంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా స్పందించి చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో అందరి మద్దతు తో జరుగుతున్న లారీల బంద్ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగా ఎలాంటి అరెస్టులకు పాల్పడినా తప్పుడు కేసులు బనాయించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బాధిత ప్రాంతాల ప్రజలను మోసగించడమే అన్నారు. ఇప్పటికైనా మేడ్చల్ ఎంపీగా ఉన్న సమయంలో రాష్ట్ర ఎన్నికలకు ముందు ఆ తర్వాత జవహర్ నగర్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేని ఎడల ప్రజా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తదనంతర పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈనెల పది నుండి 20 వరకు డంపింగ్ యార్డ్ సమస్యపై చైతన్య పాదయాత్రలు: ఈనెల 10వ తేదీ నుండి శాంతినగర్ నుండి నోబెల్ స్కూల్ వరకు, 12వ తేదీన గబ్బిలాల పేట నుండి గిరి ప్రసాద్ నగర్ వరకు, 13వ తేదీన గాంధీనగర్ నుండి భాగ్యనగర్ కాలనీ వరకు, 14వ తేదీన ప్రగతి నగర్ నుండి బీజేఆర్ నగర్ వరకు, 15వ తేదీన నోబెల్ స్కూల్ నుండి అంబేద్కర్ నగర్ వాటర్ ట్యాంక్ వరకు, 16వ తేదీన కార్మిక నగర్, 17వ తేదీన మల్కారం, 18 వ తేదీన శివాజీ నగర్, 19వ తేదీన వికలాంగుల కాలనీ లెప్రసీ కాలనీ, 20వ తేదీన బాలాజీ నగర్ ఫైరింగ్ గడ్డ నుండి మెయిన్ బస్టాండ్ వరకు ప్రజా చైతన్య పాదయాత్రల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారులు మాజీ ఉపసర్పంచ్ నరసింహ గౌడ్, తోటపల్లి శంకర్, అనురాధ, వి ప్రవీణ్, పెరక సునీత, పి. శివబాబు, చంద్రమౌళి, బహుజన సత్త సింగరాయ గౌడ్, కమిటీ సభ్యులు సుర వెంకటేష్, స్వరూప, లక్ష్మీ బాయి, జయసుధ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- **సింగరేణిలో మెడికల్ బోర్డును నిర్వహించాలి**
- **కంపెనీ పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం**
- **తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను పార్టీ పెట్టిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వణుకు పుడుతుందన్నారు. తమ పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా కంప్లైంట్స్ ఇవ్వడం జరిగిందన్నారు. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండాలని కుట్రలు చేస్తున్నారని తెలిపారు. నా ప్రజా పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలుపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక నీతి, నియమం అంటూ ఏమీ లేవా అంటూ ప్రశ్నించారు. తల్లి చెల్లె అనే సభ్యత మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారం కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదని కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం అంటూ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ అయిన హరీశ్ రావు నే బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతుందన్నారు. ఇక ఆ పార్టీ జీవితంలో బాగుపడదని స్పష్టమైందన్నారు. సింగరేణి పరిరక్షణ కొరకు తాను శక్తి మేరకు పోరాడుతానని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఇవ్వాళ సింగరేణి ఇబ్బందుల్లో ఉండటానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. సంస్థకు ఇవ్వాల్సిన 54 వేల కోట్లు ఇవ్వకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పనిముట్లు అడిగితే పైసలు లేవంటున్నారని ఇది మహా దారుణమన్నారు. సింగరేణి కార్మికుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సింగరేణిలో వన్ విజన్, వన్ ఫ్యామిలీ అంటారు కానీ ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తుందన్నారు. కిషన్ రెడ్డి తెలంగాణ బిడ్డనే అయితే సింగరేణికి టెండర్లు లేకుండా గనులు ఇవ్వాలని తాను నిర్వహించిన మొదటి దఫా బాయి బాటలో డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఒక మైనింగ్ ఇచ్చి ఏదో గొప్పగా చెప్పుకుంటున్నారు కానీ మిగతా 16 గనులను కూడా సింగరేణికి ఇవ్వాలని కోరారు. బీజేపీ నిర్లక్ష్యం కారణంగా సింగరేణి కార్మికులకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. సింగరేణికి ఇచ్చిన తాడిచర్ల2 సింగరేణియే ఆపరేట్ చేసేలా ఇవ్వాలని అప్పుడు మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాడిచర్ల1 మైనింగ్ ను దొడ్డిదారిన ప్రైవేట్ వాళ్లకు ఇవ్వటంతో కార్మికులకు చాలా అన్యాయం జరిగిందన్నారు. సింగరేణిలో 62 వేల మంది కార్మికులు, ఆఫీసర్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందన్నారు. సింగరేణిలో డింపెడెంట్ ఉద్యోగాలు వచ్చేలా బీఆర్ఎస్ గవర్నమెంట్ లో నేను ఎంతో కృషి కృషి చేశానని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు దాన్ని నాశనం చేశారని డబ్బు ఇచ్చిన వాళ్లకే అన్ ఫిట్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు కచ్చితంగా నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టి పెండింగ్ లో ఉన్న డింపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత నెలకు ఒకసారి మెడికల్ బోర్డు పెట్టాలని కోరారు. మెడికల్ బోర్డు పెట్టకపోతే నిరాహార దీక్ష చేస్తా అని హెచ్చరించటంతో మెడికల్ బోర్డు పెడతామంటూ ప్రకటనలు ఇస్తున్నారని కానీ ప్రభుత్వం తరపున స్పష్టమైన ప్రకటన చేయాలని లేదంటే ప్రజాస్వామ్యయుతంగా నిరాహార దీక్ష చేస్తానని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల కోసం ప్రాణాలకు తెగించి మేము పోరాటం చేసి చూపిస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

# సర్ పై జూమ్ మీటింగ్

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జులై 9, మహా**

కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గురువారం సర్ అంశం పై నిర్వహించిన జూమ్ సమావేశంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ జూమ్ మీటింగ్లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ల లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ ఈఆర్ఓ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.. సర్ అంశంపై పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, సమన్వయం, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు కీలక సూచనలు చేశారు.





# బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

**పాల్గొన్న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జులై 9 మహా** బీబీనగర్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( ఎయిమ్స్) అభివృద్ధి మరియు వివిధ పనుల పురోగతిపై గురువారం కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ, రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ముఖ్య అతిథిగా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం మరియు పనుల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని స్థానిక అంశాలపై చర్చించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఎయిమ్స్ కమిటీ సభ్యులు మరియు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, డి.కె. అరుణ మరియు ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అమిత అగర్వాల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా మరియు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసి ఎయిమ్స్ లోని వివిధ విభాగాలు, అందుతున్న వైద్య సేవలు మరియు నిర్మాణంలో ఉన్న భవనాల పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు ఎంపీ చామల మాట్లాడుతు తెలంగాణ ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను త్వరితగతిన పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు, వైద్య సిబ్బంది మరియు విద్యార్థులకు అవసరమైన వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో బీబీనగర్ ఎయిమ్స్‌ను దేశంలోనే ఒక ఆదర్శవంతమైన వైద్య సంస్థగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎయిమ్స్ ఉన్నతాధికారులు, వైద్యులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యూసెన్స్‌కు పాల్పడిన వారికి కోర్టు గుణపాఠం

- **జరిమానాతో పాటు కమ్యూనిటీ సర్వీస్, ట్రాఫిక్ విధులు నిర్వహించాలని కోర్టు ఆదేశం**

**కుషాయిగూడ, మహా :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడిన నలుగురికి కోర్టు వినూత్న శిక్ష విధించింది. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. వీరిని 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం ఒక నిందితుడికి జరిమానాతో పాటు పోలీస్‌స్టేషన్‌లో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని కోర్టు ఆదేశించింది. మిగిలిన ముగ్గురికి జరిమానాతో పాటు రెండు రోజుల పాటు రోజుకు గంటసేపు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పు వెలువరించింది.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కుషాయిగూడ పోలీసులు హెచ్చరించారు.



# అరుణోదయ నాగన్న ఆశయాలను కొనసాగిద్దాం

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం పేరుపల్లి లో గురువారం సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అరుణోదయ నాగన్న సంతాప సభ ను గురువారం నిర్వహించారు. నాగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ కవి, గాయకులు, రచయిత, కళాకారుడైన నాగన్న అరుణోదయ వ్యవస్థాపకులుగా తన ఇంటి పేరునే అరుణోదయ గా మారిందన్నారు. గత 50 ఏండ్లుగా రైతు కూలీలు, కార్మికులు, పీడిత ప్రజల నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఆటపాటలతో ప్రజలను మేల్కొల్పారన్నారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా నిత్యనిర్బంధాలను ఎదుర్కొని పేద ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతం కోసం తన చివరి శ్వాస వరకు పోరాటాలకు ఊపిరి పోశారన్నారు. నాగన్న స్వగ్రామమైన రాజారాం గ్రామంలో ఈనెల 13నఉదయం 10 గంటలకు జరుగు నాగన్నసంతాప బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎన్డీ మండల నాయకులు అలెం గురవయ్య, చంద్రయ్య, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి వై జానకి, సుగుణ, కోటక్క, నాగేశ్వరరావు, నరేష్, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలను మనీషాలక్ష్మి పరామర్శ

**కారేపల్లి, మహా :** బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి గురువారం సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటివల మృతి చెందిన మాదారం గ్రామ ఉపసర్పంచ్ బానోత్ లాలు, పేరుపల్లి గ్రామానికి చెందిన బుడిగ శ్రీను, పాత కమలాపురం సర్పంచ్ దివంగత తేజవత్ బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మనీషా లక్ష్మి వెంట మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, మాజీ దిశ కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే గౌసుద్దీన్, జిల్లా నాయకులు డొంకెన రవీందర్ , పేర్ని వెంకటేశ్వర్లు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, గంగారబోయిన మురళి, పిల్లలమర్రి వెంకటేష్, మధు,పెద్దబోయిన సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వారణాసిలో రాజమౌళి మేకింగ్ మ్యాజిక్.. భారీ సవాళ్ల మధ్య చిత్రీకరణ

భారతీయ సినీ పరిశ్రమను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తన కొత్త చిత్రం కోసం వారణాసిలో అత్యంత ప్రతిష్టాత్మక షెడ్యూల్‌ను ప్రారంభించారు. భారీ సెట్లు, అత్యాధునిక సాంకేతికతతో అద్భుతాలు సృష్టించిన రాజమౌళి.. ఈసారి సహజసిద్ధమైన లొకేషన్లలోనే ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విజువల్ అనుభూతిని అందించేందుకు కృషి చేస్తున్నారు. గతంలో **'బాహుబలి'** కోసం ఎంత శ్రమించారో, అంతకంటే ఎక్కువ శ్రద్ధతో వారణాసి షెడ్యూల్‌ను ప్లాన్ చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.


గంగా తీరం, ప్రాచీన ఘాట్‌లు, ఇరుకైన వీధులు, నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతాల్లో చిత్రీకరణ చేయడం సాధారణ విషయం కాదు. అవసరమైన చోట్ల సెట్లు నిర్మించినప్పటికీ, కథకు జీవం పోసే కీలక సన్నివేశాలను నిజమైన లొకేషన్లలోనే చిత్రీకరించాలని రాజమౌళి నిర్ణయించినట్లు సమాచారం. తెరపై కనిపించే సహజత్వం కోసం ఆయన ఎలాంటి రాజీ పడటం లేదని తెలుస్తోంది.

వారణాసి వంటి ప్రాంతంలో చిత్రీకరణ అంటే సాంకేతికంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. పరిమిత స్థలంలో భారీ కెమెరా పరికరాలను అమర్చడం, సహజ వెలుతురుకు అనుగుణంగా షూటింగ్ నిర్వహించడం, పర్యాటకుల రద్దీ మధ్య ప్రతి షాట్‌ను పూర్తి చేయడం ఎంతో క్లిష్టమైన పని. అయినప్పటికీ ప్రతి ఫ్రేమ్‌ను తనకు కావాల్సిన స్థాయిలో తీర్చిదిద్దేందుకు రాజమౌళి గంటల తరబడి శ్రమిస్తున్నారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

ఈ చిత్రంలో వారణాసి కేవలం నేపథ్యం మాత్రమే కాదు.. కథలో భాగమైన మరో ప్రధాన పాత్రలా కనిపించేలా రాజమౌళి చిత్రీకరిస్తున్నారని సమాచారం. నగరంలోని ఆధ్యాత్మిక వాతావరణం, చారిత్రక వైభవం, గంగా తీరం ప్రత్యేకతను ప్రతి ఫ్రేమ్‌లో ప్రతిబింబించేలా మేకింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. భారీ గ్రాఫిక్స్‌పై ఆధారపడకుండా సహజ అందాన్ని తెరపై ఆవిష్కరించాలనే ప్రయత్నం ఈ చిత్రంలో స్పష్టంగా కనిపించనుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

బాహుబలి'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాల తర్వాత రాజమౌళి నుంచి వస్తున్న ప్రతి ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ప్రతి సన్నివేశాన్ని అత్యంత నాణ్యతతో తెరకెక్కించేందుకు ఆయన ఎలాంటి రాజీ పడటం లేదు. ప్రస్తుతం వారణాసిలో సాగుతున్న ఈ చిత్రీకరణ పూర్తయిన తర్వాత ప్రేక్షకులకు మరో అద్భుతమైన దృశ్యానుభూతి అందడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మేకింగ్ పరంగా ఎదురవుతున్న ప్రతి సవాలును అవకాశంగా మలుచుకుంటూ రాజమౌళి ముందుకు సాగుతున్నారు. కఠినమైన లొకేషన్లలో చిత్రీకరణ ఎంత క్లిష్టమైనదైనా, తెరపై అసాధారణ ఫలితాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషి మరోసారి భారతీయ సినీ పరిశ్రమలో తన ప్రత్యేకతను చాటనుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రణీత సుభాష్ అందాల మాయ

సహజమైన అందం, హుందాతనం, ఆత్మవిశ్వాసంతో ప్రణీత సుభాష్ మరోసారి అభిమానులను ఆకట్టుకున్నారు. లేత గోధుమరంగు లేస్ డిజైన్‌తో అలంకరించిన స్లిప్ డ్రెస్‌లో ఆమె ఎంతో సొగసుగా కనిపించారు. వదులుగా జారిన నల్లని జుట్టు, మృదువైన మేకప్, గడ్డంపై చేయి ఆనించి ఇచ్చిన స్టైలిష్ పోజ్ ఆమె ఆకర్షణను మరింత పెంచింది.

1992 అక్టోబర్ 17న కర్ణాటకలోని బెంగళూరులో జన్మించిన ప్రణీత సుభాష్, దక్షిణ భారత సినీ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, 2010లో విడుదలైన కన్నడ చిత్రం పోర్కితో నటిగా అరంగేట్రం చేశారు. ఈ చిత్రం తెలుగు సూపర్ హిట్ పోకిరికి రీమేక్.


2012లో విడుదలైన భీమ తీరద చిత్రంలో నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ప్రణీత, అనంతరం బావ, అత్తారింటికి దారేది, మాసు ఎంగిర మాసిలామణి, హలో గురు ప్రేమ కోసమే వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ఆదరణ పొందారు. కన్నడ, తెలుగు, తమిళంతో పాటు హిందీ, మలయాళ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. హిందీలో హంగామా 2, భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా చిత్రాల్లో నటించారు. 2021లో నితిన్ రాజును వివాహం చేసుకున్న ప్రణీత, ఇద్దరు పిల్లలకు తల్లిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ, తన హుందాతనం, అంకితభావంతో ప్రేక్షకుల అభిమానాన్ని కొనసాగిస్తున్నారు



# 'జననాయకన్'కు సెన్సార్ క్లియరెన్స్.. విజయ్ అభిమానుల నిరీక్షణకు తెర

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు రాజకీయ నాయకుడు దళపతి విజయ్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'జననాయకన్' సినిమా కీలక మైలురాయిని దాటింది. పలు వివాదాలు, సెన్సార్ జాప్యాల తర్వాత ఈ చిత్రం ఎట్టకేలకు సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఎ' సర్టిఫికెట్ జారీ చేసింది.

సెన్సార్ ధ్రువీకరణ పత్రం ప్రకారం సినిమా నిడివి 183 నిమిషాల 11 సెకన్లు, అంటే దాదాపు 3 గంటల 3 నిమిషాలు ఉండనుంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.గత కొన్ని నెలలుగా సెన్సార్ సంబంధిత అభ్యంతరాలు, లీక్ ఘటనలు తదితర కారణాలతో చిత్ర విడుదల ఆలస్యమైంది. అయితే సెన్సార్ బోర్డు సూచించిన మార్పులన్నింటినీ పూర్తి చేసిన తర్వాత జూలై 9, 2026న అధికారికంగా క్లియరెన్స్ లభించింది. దీంతో చిత్ర బృందం విడుదల పనులను వేగవంతం చేసింది.రాజకీయాల్లో పూర్తిస్థాయిలో అడుగుపెట్టిన తర్వాత విజయ్ నుంచి వస్తున్న తొలి చిత్రం కావడం, అలాగే సినీ కెరీర్‌లో ఆయన చివరి సినిమా అనే ప్రచారం ఉండటంతో 'జననాయకన్'పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మాస్ సంచలనం సృష్టిస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం 'జననాయకన్' ప్రపంచవ్యాప్తంగా జూలై 24న భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది.







# 'టాక్సిక్'తో గీతు మోహన్‌దాస్ మాస్టర్ స్ట్రోక్

స్టోరీని బోల్డ్‌గా, రొమాంటిక్‌గా నడిపించడంలో సందీప్ రెడ్డి వంగా ఎక్స్‌పర్ట్. ఇప్పుడు ఈ దర్శకుడిని లేడీ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ మించిపోయింది. సందీప్ ఫార్ములాను ఫాలో అవుతూ ఆయన్నే మించిపోయిందా? 'టాక్సిక్' నుంచి వచ్చిన 'తబాహి' సాంగ్‌తో గీతు మరొకసారి హీట్ ఎలా పెంచింది. యష్, కియారా అద్వానీలపై తీసిన 'తబాహి' సాంగ్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. 'టాక్సిక్'తో పాటు తనని తాను ప్రమోట్ చేసుకోవడంలో గీతు మోహన్‌దాస్, సందీప్ వంగాను ఫాలో అయింది. కేజీఎఫ్2 వంటి ప్యాన్ ఇండియా హిట్ తర్వాత రెండేళ్లు విరామం తీసుకొని 'టాక్సిక్' మూవీ ప్రకటించాడు యష్. ఎంతో మంది క్రేజీ డైరెక్టర్లు యష్‌తో వర్క్ చేయాలని ఎదురుచూస్తే, అసలు ఒక్క హిట్ లేని గీతుకి డైరెక్షన్ ఛాన్స్ ఇవ్వటం ఏంటంటూ ఫ్యాన్స్ కూడా పెదవి విరిచారు. సినిమాకు క్రేజ్ తీసుకురావడం కోసం సందీప్ రెడ్డి రొమాంటిక్ అండ్ వయలెన్స్ ఫార్ములాను ఫాలో అయింది గీతు. సందీప్ తీసింది రెండు సినిమాలే అయినా రొమాన్స్ అండ్ వయలెన్స్‌నే నమ్ముకున్నాడు.'అర్జున్ రెడ్డి'లో వయలెన్స్ తక్కువే అయినా, 'అనిమల్'లో డోస్ ఒక్కసారిగా పెంచేశాడు. ఇక 'అనిమల్' దగ్గరికి వచ్చేసరికి తృప్తి దిమ్రి, రణబీర్ మధ్య ఇంటిమేట్ సీన్స్‌తో.. అలాగే రష్మిక, రణబీర్ మధ్య రొమాంటిక్ సీన్స్‌తో కథను నడిపించాడు సందీప్. ఇదే ఫార్ములాను 'టాక్సిక్' కోసం గీతు ఫాలో కావడమే కాదు, సందీప్‌ను మించిపోయింది. గీతు రొమాంటిక్ విజన్ చూస్తుంటే ప్రభాస్‌తో తీస్తున్న 'స్పిరిట్'లో సందీప్ మరింత టాలెంట్ చూపించాల్సిందే, లేదంటే గీతు ముందు తేలిపోయే ఛాన్స్ ఉంది. సినిమాకు ఓపెనింగ్స్ రావాలంటే యూత్‌ను అట్రాక్ట్ చేయాలి. ఈ విషయంలో గీతు మోహన్‌దాస్ సక్సెస్ అయింది. హద్దులు దాటిన రొమాన్స్‌తో యూత్ దృష్టిని 'టాక్సిక్' వైపు మరల్చింది. ఈ లెక్కన ఆగస్టు 26న ప్యాన్ ఇండియాగా రిలీజ్ అవుతున్న 'టాక్సిక్'కు ఓపెనింగ్స్ రావడం గ్యారెంటీ అనిపిస్తున్నా.. రొమాన్స్, వయలెన్స్ మాత్రమే కథను నడిపించలేవు. ఇవి ఒక పార్ట్ అయితే పర్వాలేదు కానీ, వీటినే నమ్ముకొని కథ రాసుకుంటే మాత్రం వీకెండ్ మూవీలా మిగిలిపోతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com